# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక :279 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి గురువారం 15 అక్టోబర్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :279 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI THU 15 OCTOBER 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


## జనసేనలో చేరిన వంగవీటి రాధా..

### విజయవాడ మేయర్ రేసులో ఉంటారా?



- కండువా కప్పి ఆహ్వానించిన పవన్ కల్యాణ్
- విజయవాడ మేయర్ రేసులో రాధా పేరు
- జనసేనలో చేరిన తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్
- విజయవాడలో 35 డివిజన్లు జనసేన కోరుతున్నట్లు సమాచారం
- కూటమి సీట్ల సర్దుబాటుపై కొనసాగుతున్న చర్చలు

పెన్ పవర్ డెస్క్:మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ జనసేన పార్టీలో చేరారు. బుధవారం అమరావతిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్ కూడా జనసేనలో చేరారు.

- మిగతా 2లో




**ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పుణేఠా బుధవారం విజయవాడలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.**



పెన్ పవర్ డెస్క్: ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చింది.తొలి విడతలో భాగంగా 100 పట్టణ స్థానిక సంస్థలకు (ఖాదీ) ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరించనుండగా, 19న పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహించి, 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.రెండో విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 3న పోలింగ్, 5న ఫలితాలు వెల్లడిస్తారు. ఇక మూడో విడతలో గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. నవంబర్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్, లెక్కింపు ప్రక్రియ పూర్తి చేస్తారు. రిజర్వేషన్లపై న్యాయపరమైన చిక్కుముడులు వీడి, ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేయడంతో ఎన్నికల ప్రక్రియకు మార్గం సుగమమైంది.



## బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

- విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు
- గన్నవరం విమానాశ్రయంలో రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికిన ప్రముఖులు
- ఆలయంలో వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్న రాష్ట్రపతి
- దర్శనం కోసం వేచి ఉన్న భక్తులను ఆప్యాయంగా పలకరించిన ముర్ము

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఆమె అమ్మవారి సన్నిధికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ పర్యటన కోసం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కమలేశ్ పాశ్వాన్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, ఎంపీ వల్లభనేని బాలశౌరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.అనంతరం ఇంద్రకీలాద్రికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్ర హోంమంత్రి అనిత, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ ఆమెను ఆలయంలోకి ఆహ్వానించారు. గర్భాలయంలో

- మిగతా 2లో



## విజయనగరం జడ్పీ రేసులో బొత్స సత్యనారాయణ కూతురు అనూష?

- టీడీపీలోకి వెళ్లిన మేనల్లుడు చిన్న శ్రీనుకు చెక్ పెట్టే వ్యూహం
- బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో మారిన సమీకరణాలు
- చిన్న శ్రీను కూడా తన కుమార్తెను బరిలోకి దించనున్నట్లు ప్రచారం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో విజయనగరం జిల్లా రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా జెడ్పీ చైర్‌పర్సన్ పీఠం కోసం వైసీపీ కొత్త వ్యూహానికి పదును పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే వైసీపీని వీడి టీడీపీలో చేరిన తన మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)కి రాజకీయంగా చెక్ పెట్టేందుకు,

- మిగతా 2లో

## ప్రజాబలంపై కాదు.. పోలీసు బలంపై ఆధారపడ్డారు

- స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వం పోలీసులను వాడుకుంటోందని కన్నబాబు ఆరోపణ
- కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా అభ్యర్థులను అడ్డుకుంటున్నారని విమర్శ
- వైసీపీ కార్యకర్తలపై పాత కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపాటు

- మిగతా 2లో



## జగన్ అక్రమాస్తుల కేసులపై కీలక పరిణామం..

## ఇక రోజువారీ విచారణ

- జగన్ ఈడీ కేసులపైనా ఇక రోజువారీ విచారణ
- విచారణ వేగవంతం చేయాలని సీబీఐ కోర్టు నిర్ణయం
- జగన్‌తో పాటు 70 మంది నిందితుల వ్యక్తిగత విచారణ
- పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 9 ఈడీ ఛార్జిషీట్లు

పెన్ పవర్ డెస్క్:మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనపై ఉన్న సీబీఐ కేసులతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్

- మిగతా 2లో



## ఢిల్లీలో అక్టోబర్ 16న 'తిరంగా' నిరసన..

### కొత్త ఆందోళనకు అభిజీత్ దీప్కే పిలుపు

- సాయంత్రం 5 గంటలకు సెంట్రల్ పార్క్‌లో కార్యక్రమం
- నిరసనకు 'లెహ్రా దో తిరంగా' పేరు
- సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాల అరెస్టుకు నిరసనగా కార్యక్రమం
- అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల
- స్థానికంగా తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే పిలుపు



పెన్ పవర్ డెస్క్:తమ పార్టీ సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 16న ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో త్రివర్ణ పతాక

- మిగతా 2లో



### జర్మనీలో ఘోర అగ్నిప్రమాదం..

## ముగ్గురు భారతీయుల సజీవ దహనం

- జర్మనీలోని బోచుమ్ నగరంలో ఘోర అగ్నిప్రమాదం
- ఘటనలో ముగ్గురు భారతీయులు మృతి
- మృతుల్లో ఇద్దరు యువతులు, ఒక యువకుడు
- ఐదుగురికి గాయాలు, ఆసుపత్రికి తరలింపు
- హత్య అనుమానంతో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

పెన్ పవర్ డెస్క్:జర్మనీలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ముగ్గురు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. బోచుమ్ నగరంలోని

- మిగతా 2లో

## పాక్ సహా 31 దేశాల పైలట్లపై 'ఎయిర్ ఫ్రాన్స్' నిషేధం

- ఇజ్రాయెల్ వెళ్లే విమానాల్లో 31 దేశాల సిబ్బందిపై నిషేధం
- ఇజ్రాయెల్ నిబంధనలను పాటిస్తున్నట్లు ప్రకటించిన ఎయిర్ ఫ్రాన్స్
- ఫ్లైదుబాయ్ విమానం హైజాక్ యత్నం తర్వాత కఠిన నిర్ణయం
- ఈ నిర్ణయం ఫ్రెంచ్ ఉపాధి చట్టాలకు విరుద్ధమంటూ ఆందోళనలు

- మిగతా 2లో






### భారత్ ఎదుగుదలను మేమే

## పరిమితం చేసుకోలేం

పెన్ పవర్ డెస్క్:భారత్‌ను 'మధ్యస్థాయి శక్తి' అని పిలవడం సరికాదని, ఆ నిర్వచనంతో దేశాన్ని పరిమితం చేసినట్లు అవుతుందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. తాము మధ్యస్థ శక్తి కాదని, 'మధ్యలో ఉన్న శక్తి' అని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం 'బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ

- మిగతా 2లో

## భారత్‌తో సంబంధాలు మళ్లీ గాడిన పడుతున్నాయి

### కెనడా విదేశాంగ మంత్రి



- నిజ్జర్ హత్య తర్వాత భారత్‌తో సంబంధాలు మెరుగుపడ్డాయన్న మంత్రి
- ఖలిస్థానీ నినాదాలపై సమతుల్యం పాటించాల్సి ఉందన్న అనితా ఆనంద్
- బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా గుర్తించిన కెనడా ప్రభుత్వం
- డిసెంబర్‌లో కెనడాలో ప్రధాని మోదీ పర్యటించే అవకాశం

- మిగతా 2లో




## పరిమితి పాతాళంలో.. ఖర్చు ఆకాశంలో..
# పొంతన లేని ఎన్నికల ఖర్చులు

రాష్ట్రంలో స్థానిక ఎన్నికల వాతావరణం అలుముకుంది. నోటిఫికేషన్ విడుదలకు ముందు ఎన్నికల కమిషన్ ఒక్కొక్క పని చక్కబెడుతోంది. ఇప్పటికే మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేయగా, జడ్పీ, మండలాలు, పంచాయతీలకు ఈ రోజు సాయంత్రం కల్లా రిజర్వేషన్లు ఖరారు కానున్నాయని అంటున్నారు. ఇక ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చులపై పరిమితి విధిస్తూ ఎన్నికల సంఘం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. అయితే ఎన్నికల సంఘం విధించే పరిమితులకు వాస్తవంగా అయ్యే ఖర్చుకు ఎక్కడా పొంతన ఉండటం లేదని చెబుతున్నారు. ఎన్నికలు అంటేనే ధన బలం ఎక్కువగా చూపాల్సి వుంటుందని అంటున్నారు. ఎన్నికలలో డబ్బు దుర్వినియోగం కాకుండా, ప్రలోభాలకు అవకాశం ఇవ్వకుండా ఎన్నికల సంఘం నిఘా వేసిన అదంతా తూతూ మంత్రంగానే ఉంటుందని వ్యాఖ్యానిస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చులపై పరిమితులు ఆసక్తి రేపుతున్నాయి. పది వేల జనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచులు రూ.2.5 లక్షలు, వార్డు సభ్యులు రూ.50 వేలు ఖర్చు చేయాల్సివుంటుందని అంటున్నారు. అదే సమయంలో పది వేల కన్నా ఎక్కువ జనాభా ఉండే పంచాయతీల్లో సర్పంచులు రూ.4 లక్షలు, వార్డు సభ్యులు లక్ష చొప్పున ఖర్చు చేసుకోవచ్చునని ఎన్నికల సంఘం సూచించింది. అదే సమయంలో జడ్పీటీసీ అభ్యర్థులు రూ.8 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థులు రూ.4 లక్షలు, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థులు రూ.20 లక్షలు, కౌన్సిలర్లు రూ.7.5 లక్షలు, విశాఖ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థి 40 లక్షలు, ఇతర కార్పొరేషన్లలో మేయర్ అభ్యర్థులు 25 లక్షలు, కార్పొరేటర్లు విశాఖలో రూ20 లక్షలు, ఇతర ప్రాంతాల్లో రూ.10 లక్షల చొప్పున ఖర్చు చేయాల్సివుంటుంది. అయితే ఎన్నికల సంఘం విధించిన ఈ పరిమితి ఏమూలకూ చాలదని, నామినేషన్ వేయడానికి ముందే ఈ ఖర్చులు అయ్యే పరిస్థితి ఉందని అంటున్నారు. ఎన్నికలు అంటేనే ధన ప్రవాహం ఎక్కువగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతి పనికి డబ్బు ఖర్చు చేయాల్సివుండటం, డబ్బు పెట్టకపోతే కనీసం ఒక్క కార్యకర్త కూడా పలికే అవకాశం లేకపోవడంతో పోటీ చేసే అభ్యర్థులు భారీగా వెచ్చించాల్సివుంటుందని అంటున్నారు. నామినేషన్ వేసేటప్పుడు జన సమీకరణ నుంచి వారికి భోజనాలు, మద్యం పంపిణీతో కలుపుకుంటే తొలిరోజే మున్సిపల్ కార్పొరేషన్లలో కోట్లలో ఖర్చు చేయాల్సివుంటుందని అంటున్నారు. కనీసం ప్రతి కార్యకర్తకు రూ.500 నుంచి ఇచ్చుకోవాల్సివుంటుందని అంటున్నారు. ఇక ఎన్నికల ముగిసే వరకు కార్యకర్తలను ప్రసన్నం చేసుకోడానికి ఓటరు దేవుడిని ఆకట్టుకోడానికి డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందని అంటున్నారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ లో రూ.40 లక్షల వరకు ఖర్చు చేయొచ్చని ఎన్నికల సంఘం పరిమితి విధించగా, ఇక్కడ దాదాపు 40 కోట్ల కంటే ఎక్కువే ఖర్చు అయ్యే అవకాశం ఉందని అంటున్నారు. అదేవిధంగా విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, కడప, కర్నూలు వంటి నగరాల్లోనూ ఖర్చు కోట్లపైనే ఉంటుందని అంటున్నారు. మేయర్, చైర్మన్ అభ్యర్థులను ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకోవడం వల్ల డబ్బు మరింత ఖర్చు పెట్టాల్సివుంటోందని అంటున్నారు. గతంలో ఈ పదవులకు పరోక్ష విధానంలో ఎన్నికలు జరిగేవని, దీనివల్ల కౌన్సిలర్ అభ్యర్థులు స్థానికంగా మేనేజ్ చేసుకుని కాస్త తక్కువ ఖర్చుతో బయటపడేవారని చెబుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ సారి ప్రత్యక్ష విధానంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల మేయర్, చైర్మన్ పదవులకు ప్రతిష్ఠ పెరిగిందని, ఐదేళ్లు పదవిలో ఉండే అవకాశం ఉండటం వల్ల అభ్యర్థులు కూడా తమ వ్యక్తిగత పరువు ప్రతిష్టల కోసం ఎక్కువ ఖర్చు పెట్టే అవకాశం ఉందని అంటున్నారు.

## బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న
# రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

- మొదటి పేజి తరువాయి

అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, వేద పండితులు రాష్ట్రపతికి వేదాశీర్వచనాలు అందించారు. ఆలయ అధికారులు ఆమెకు పట్టువస్త్రాలు, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులను రాష్ట్రపతి ఆప్యాయంగా పలకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ఆమె ముందుకు సాగారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# జనసేనలో చేరిన వంగవీటి రాధా..

- మొదటి పేజీ తరువాయిది

ఈ పరిణామంతో విజయవాడ మేయర్ అభ్యర్థిగా రాధాకృష్ణ పేరు తెరపైకి వచ్చింది. విజయవాడ మేయర్ పదవికి రాధాకృష్ణ పోటీ చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే, మేయర్ సీటును కూటమిలో జనసేనకు కేటాయిస్తారా? అన్నది ఇంకా స్పష్టం కాలేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి రాధాకృష్ణ కృషి చేశారు. వైసీపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత టీడీపీతో కలిసి పనిచేస్తూ వచ్చారు. ఇప్పుడు జనసేనలో చేరడంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. మరోవైపు, స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, జడ్పీ ఛైర్మన్ల పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఇప్పటికే గెజిట్‌లు విడుదల చేసింది. ఈ తరుణంలో రాధా చేరికకు ప్రాధాన్యం ఏర్పడింది. స్థానిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై కూటమి నేతలు చర్చలు జరుపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో జనసేన నేతలు నాదెండ్ల మనోహర్, లింగమనేని రమేశ్, హరిప్రసాద్ సమావేశమయ్యారు. విజయవాడలోని 86 డివిజన్లలో 35 స్థానాలు తమకు కేటాయించాలని జనసేన కోరుతున్నట్లు సమాచారం. అయితే, 15 స్థానాలు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సీట్ల పంపకాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

# ప్రజాబలంపై కాదు..
# పోలీసు బలంపై ఆధారపడ్డారు

ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజాబలంపై కాకుండా పోలీసుల శక్తిపై ఆధారపడిందని వైసీపీ ఆరోపించింది. వైసీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకునేందుకు అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి కురసాల కన్నబాబు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ప్రజాబలం లేకే చంద్రబాబు ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో గెలవాలని చూస్తోంది. వైసీపీ తరఫున పోటీ చేయాలనుకుంటున్న వారిని బెదిరిస్తున్నారు. పాత కేసులు తిరగదోడి, బైండోవర్ల పేరుతో ఉదయం నుంచి రాత్రి వరకు పోలీస్ స్టేషన్లలో కూర్చోబెట్టి వేధిస్తున్నారు. కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో కావాలనే జాప్యం చేస్తున్నారు" అని ఆరోపించారు. క్వాంటం కంప్యూటింగ్ గురించి మాట్లాడే ప్రభుత్వం, క్యాస్ట్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఒక యాప్‌ను సరిగా నడపలేకపోతోందా అని ఆయన ప్రశ్నించారు. 24 గంటల్లో మాన్యువల్‌గా సర్టిఫికెట్లు అందించాలని డిమాండ్ చేశారు.

పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను పూర్తిగా వెబ్‌కాస్టింగ్ చేయాలని, సున్నితమైన ప్రాంతాల్లో కేంద్ర బలగాలను మోహరించాలని కన్నబాబు డిమాండ్ చేశారు. వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల కేటాయింపులోనూ అవకతవకలు జరిగాయని, ఇవి ప్రజల సౌలభ్యం కోసం కాకుండా అధికార పార్టీకి అనుకూలంగా జరిగాయని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, జగన్ నాయకత్వంలో ప్రతి వార్డులోనూ పోటీ చేసి గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# విజయనగరం జడ్పీ రేసులో బొత్స సత్యనారాయణ కూతురు అనూష?

- మొదటి పేజి తరువాయి

సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తన కుమార్తె బొత్స అనూషను రంగంలోకి దించాలని యోచిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. విజయనగరం జెడ్పీ చైర్‌పర్సన్ పదవిని ఈసారి బీసీ (మహిళ)కు రిజర్వ్ చేశారు. ఇదే ఇప్పుడు రాజకీయ సమీకరణాలకు కేంద్ర బిందువుగా మారింది. గతంలో వైసీపీ తరఫున జెడ్పీ చైర్మన్‌గా ఉన్న చిన్న శ్రీను, ఇప్పుడు టీడీపీ కూటమి తరఫున తన కుమార్తె సిరి సహస్రను బరిలోకి దించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చిన్న శ్రీను దూకుడుకు కళ్లెం వేయాలంటే, బొత్స కుటుంబం నుంచే బలమైన అభ్యర్థిని నిలబెట్టాలని వైసీపీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా వృత్తిరీత్యా డాక్టర్ అయిన బొత్స అనూషను చైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

ప్రస్తుతం బొత్స అనూష భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఒకవేళ పార్టీ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇస్తే, ఆమె విజయనగరం జెడ్పీ చైర్‌పర్సన్ బరిలో నిలవడం ఖాయమని చెబుతున్నారు. ఇదే జరిగితే విజయనగరం జెడ్పీ ఎన్నికల పోరు, బొత్స కుటుంబ సభ్యుల మధ్య ప్రత్యక్ష పోరుగా మారి రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించడం ఖాయం.

# ఢిల్లీలో అక్టోబర్ 16న 'తిరంగా' నిరసన..

- మొదటి పేజి తరువాయి

ప్రదర్శన నిర్వహించనున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. దేశభక్తులంతా జాతీయ జెండాలతో సెంట్రల్ పార్క్‌కు రావాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో విడుదల చేసిన వీడియో సందేశంలో ఈ నిరసనకు 'లెహ్రావో దో తిరంగా' అని పేరు పెట్టినట్లు దీప్కే తెలిపారు. కేవలం త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించినందుకే సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను జైలుకు పంపారని ఆయన ఆరోపించారు. అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌కు జాతీయ జెండాలతో చేరుకోవాలని కోరారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం నేరం కాదని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెబుతామని అన్నారు. ఢిల్లీకి రాలేని వారు తమ ప్రాంతాల్లో తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే విజ్ఞప్తి చేశారు. జాతీయ జెండా తమ గర్వకారణమని, దాన్ని ప్రదర్శించడం నేరం కాదనే సందేశాన్ని అందించాలని కోరారు. ఈ నిరసన తర్వాత తనను కూడా అరెస్టు చేసే అవకాశం ఉందని, అయినా ఆందోళన చెందడం లేదని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తానని స్పష్టం చేశారు.

**ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ**

మరోవైపు, జంతర్ మంతర్‌లోకి అక్రమంగా ప్రవేశించిన కేసులో సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలకు బుధవారం ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. సీజేపీకి చెందిన మరో నేత అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలయ్యారు. దాస్‌ను తీహార్ జైలులోని రెండో నంబర్ జైలులో, రంకాను నాలుగో నంబర్ జైలులో వేర్వేరుగా ఉంచినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. ముగ్గురు సీజేపీ సభ్యులను జంతర్ మంతర్‌లోకి చొరబడినందుకు ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నారు. జంతర్ మంతర్‌ను నిరసనలకు కేటాయించిన అధికారిక ప్రదేశాల జాబితా నుంచి తొలగించిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

# జర్మనీలో ఘోర అగ్నిప్రమాదం..
# ముగ్గురు భారతీయుల సజీవ దహనం

- మొదటి పేజి తరువాయి

ఓ నివాస భవనంలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనలో మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ సంఘటనపై హత్య అనుమానంతో పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. బోచుమ్‌లోని హోఫ్‌స్టెడ్ జిల్లాలో ఉన్న ఓ నివాస భవనంలో మంగళవారం తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం భవనంలోని రెండో అంతస్తులో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో ముగ్గురి మృతదేహాలను గుర్తించారు. మృతులను 25, 27 ఏళ్ల వయసున్న ఇద్దరు యువతులుగా, 26 ఏళ్ల యువకుడిగా గుర్తించారు. వీరంతా భారతీయులని అధికారులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో పొగ పీల్చడం వల్ల తీవ్ర అస్వస్థతకు గురైన మరో ఐదుగురిని చికిత్స కోసం స్థానిక ఆసుపత్రులకు తరలించారు. ప్రస్తుతం వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అయితే గాయపడిన వారి జాతీయతకు సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణ అనంతరం అదే భవనంలో నివసించే 41 ఏళ్ల రొమేనియా దేశస్థుడిని హత్య అనుమానంతో అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ అగ్నిప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

## జగన్ అక్రమాస్తుల కేసులపై కీలక పరిణామం..
# ఇక రోజువారీ విచారణ

- మొదటి పేజి తరువాయి

(ఈడీ) కేసులను కూడా రోజువారీగా విచారించాలని సీబీఐ కోర్టు నిర్ణయించింది. ఈ నిర్ణయంతో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ వేగవంతం కానుంది. ఈ కేసుల్లో జగన్‌తో పాటు మరో 70 మంది నిందితులను వ్యక్తిగతంగా విచారించాలని న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది. జగన్‌పై దాదాపు దశాబ్దకాలంగా 9 ఈడీ ఛార్జిషీట్లు న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై విచారణను వేగవంతం చేయాలని కోరుతూ ఈడీ అధికారులు ఇప్పటికే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సీబీఐ కోర్టులో నిందితులు దాఖలు చేసుకున్న డిశ్చార్జ్ పిటిషన్లపై తీర్పులు రాకపోవడంతో కేసుల విచారణ ముందుకు సాగడం లేదని ఈడీ తన పిటిషన్‌లో పేర్కొంది. ఈడీతో పాటు మాజీ మంత్రి హరిరామజోగయ్య, మరికొందరు కూడా విచారణను వేగవంతం చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సీబీఐ కోర్టు తీసుకున్న తాజా నిర్ణయంతో జగన్‌పై ఉన్న కేసుల విచారణ ఇకపై వేగంగా ముందుకు సాగే అవకాశం కనిపిస్తోంది.

# భారత్‌తో సంబంధాలు మళ్లీ గాడిన పడుతున్నాయి

ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య తర్వాత తీవ్రంగా దెబ్బతిన్న భారత్-కెనడా ద్వైపాక్షిక సంబంధాలు ఇప్పుడు మళ్లీ గాడిన పడుతున్నాయని, క్రమంగా బలపడుతున్నాయని కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ అన్నారు. ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, ఇరు దేశాల మధ్య సంబంధాలలో చోటుచేసుకుంటున్న ఈ మార్పును ఆమె ఒక "ఆహ్వానించదగ్గ పరిణామం"గా అభివర్ణించారు.

వాణిజ్యం, పర్యాటకం, విద్య వంటి రంగాల్లో ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలు చాలా లోతుగా, బలంగా ఉన్నాయని ఆనంద్ తెలిపారు. రాబోయే దశాబ్దంలో అమెరికాయేతర దేశాలతో వాణిజ్యాన్ని రెట్టింపు చేసుకోవాలని కెనడా లక్ష్యంగా పెట్టుకుందని, ఈ నేపథ్యంలో 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, ప్రపంచంలో ఆరవ అతిపెద్ద శక్తిగా ఉన్న భారత్ తమకు ఎంతో ముఖ్యమని ఆమె నొక్కిచెప్పారు. నిజ్జర్ హత్య ఉదంతంపై మాట్లాడుతూ.. కెనడా గడ్డపై ఒక కెనడా పౌరుడి హత్యకు సంబంధించిన కేసులో న్యాయపరమైన విచారణ కొనసాగుతోందని ఆమె స్పష్టం చేశారు. చట్టబద్ధ పాలన, దేశీయ భద్రతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. భారత ప్రభుత్వంతో చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించామని, ఇందులో భాగంగానే 'బిష్ణోయ్ గ్యాంగ్'ను ఉగ్రవాద సంస్థగా గుర్తించామని వెల్లడించారు. కెనడాలో నిరసనల సందర్భంగా ఖలిస్థాన్ అనుకూల నినాదాలు, ఇందిరా గాంధీ హత్యను ప్రస్తావించడం వంటి ఘటనలపై అడిగిన ప్రశ్నకు.. కెనడాలో భావప్రకటనా స్వేచ్ఛకు, ప్రజా భద్రతకు మధ్య సమతుల్యం పాటించాల్సిన అవసరం ఉందని బదులిచ్చారు. ఈ అంశాన్ని దేశ ప్రజా భద్రత, న్యాయశాఖ మంత్రులు పర్యవేక్షిస్తున్నారని, తన దృష్టి అంతా విదేశీ సంబంధాలపైనే ఉందని ఆమె వివరించారు.

కెనడా ప్రధాని మార్క్ కార్నీ, భారత ప్రధాని నరేంద్ర మోదీతో తన సంబంధానికి ఎంతో విలువ ఇస్తారని అనితా ఆనంద్ చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో కెనడా పర్యటనకు రానున్న ప్రధాని మోదీకి స్వాగతం పలికేందుకు తాము ఎదురుచూస్తున్నామని ఆమె వెల్లడించారు. ఇప్పటికే ఇరు దేశాల రాయబార కార్యాలయాలను బలోపేతం చేశామని, ఇరు దేశాల నేతలు క్రమం తప్పకుండా సమావేశమవుతూ సంబంధాలను మెరుగుపరుస్తున్నారని గుర్తుచేశారు.

## పాక్ సహా 31 దేశాల పైలట్లపై 'ఎయిర్ ఫ్రాన్స్' నిషేధం

ఇజ్రాయెల్‌కు వెళ్లే తమ విమానాల్లో పనిచేసే సిబ్బంది విషయంలో ప్రభుత్వం విధించిన కొత్త నిబంధనలను పాటించనున్నట్లు ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఫ్రాన్స్ ధృవీకరించింది. ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు లేని పాకిస్థాన్ సహా 31 దేశాలకు చెందిన పైలట్లు, క్యాబిన్ సిబ్బందిని తమ దేశంలోకి అనుమతించబోమని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎయిర్ ఫ్రాన్స్ తన సిబ్బందికి సమాచారం అందించింది.

ఇటీవల ఫ్లైదుబాయ్ విమానంలో చోటుచేసుకున్న భద్రతా సంఘటనే ఈ కఠిన నిబంధనలకు దారితీసింది. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానాన్ని ఒమన్‌కు చెందిన సహ పైలట్ హైజాక్ చేసేందుకు యత్నించిన విషయం తెలిసిందే. బెన్ గురియన్ విమానాశ్రయాన్ని ఢీకొట్టేందుకు ప్లాన్ చేశాడని, ఈ క్రమంలో భారత కెప్టెన్‌పై దాడి చేశాడని తెలిసింది. ఈ ఘటన జరిగిన మరుసటి రోజే ఇజ్రాయెల్ రవాణా మంత్రిత్వ శాఖ విదేశీ విమానయాన సంస్థలకు ఓ ఆదేశం జారీ చేసింది. పాకిస్థాన్, ఇరాన్, సౌదీ అరేబియా, అల్జీరియా, ట్యూనీషియా, ఒమన్ వంటి 31 ముస్లిం మెజారిటీ దేశాల జాతీయత లేదా ద్వంద్వ పౌరసత్వం ఉన్న సిబ్బందిని ఇజ్రాయెల్‌కు వచ్చే విమానాల్లో నియమించవద్దని స్పష్టం చేసింది. ఈ నిబంధనలను పాటించకపోతే సంస్థతో పాటు ఉద్యోగులు కూడా చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎయిర్ ఫ్రాన్స్ తన అంతర్గత మెమోలో పేర్కొన్నట్లు సమాచారం. అయితే, ఎయిర్ ఫ్రాన్స్ నిర్ణయం ఫ్రాన్స్‌లో న్యాయపరమైన చిక్కులకు దారితీసే అవకాశం ఉంది. జాతీయత లేదా మతం ఆధారంగా వివక్ష చూపడాన్ని ఫ్రెంచ్ ఉపాధి చట్టాలు నిషేధిస్తున్నాయి. ఇది ఆ దేశ చట్టాలకు విరుద్ధమని న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు దేశ భద్రత దృష్ట్యా తన గగనతలాన్ని నియంత్రించుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉన్నప్పటికీ, ఈ నిబంధనలను అమలు చేయడం వల్ల విమానయాన సంస్థలు తమ సొంత దేశాల్లో న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. ఈ నిబంధనల వల్ల విమానయాన సంస్థల సిబ్బంది షెడ్యూలింగ్‌పై ఎలాంటి ప్రభావం పడుతుందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.

# భారత్ ఎదుగుదలను మేమే పరిమితం చేసుకోలేం

- మొదటి పేజి తరువాయి

ఫోరమ్'లో జరిగిన ఒక చర్చా కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌ను మధ్యస్థ శక్తిగా ఎందుకు అభివర్ణించకూడదు అని అడిగిన ప్రశ్నకు జైశంకర్ బదులిస్తూ, "ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా, సుమారు నాలుగు ట్రిలియన్ డాలర్ల జీడీపీతో, భవిష్యత్తులో అపారమైన అభివృద్ధి అవకాశాలు ఉన్న దేశానికి 'మధ్యస్థాయి శక్తి' అనే వర్ణన సౌకర్యంగా ఉండదు. ఆ నిర్వచనంతో మనల్ని మనమే పరిమితం చేసుకున్నట్టు అవుతుంది" అని వివరించారు. ఇతరులకు సాధికారత కల్పించే దేశాలనే మధ్యస్థ శక్తులుగా ప్రధాని మోదీ అభివర్ణించారని, కానీ భారత్ విషయంలో ఈ నిర్వచనం సరిపోదని ఆయన తెలిపారు. ప్రస్తుత ప్రపంచం కేవలం మధ్యస్థాయి శక్తులతోనే కాకుండా ఇతర దేశాలపై ఒత్తిడి తెచ్చే సాధనాలతో నిండి ఉందని జైశంకర్ విశ్లేషించారు. "ఆర్థిక ఆంక్షలు, ఫైనాన్స్ వంటి అంశాలను కూడా ఇప్పుడు అస్త్రాలుగా వాడుకుంటున్నారు. ఇది ప్రపంచాన్ని మరింత సంక్లిష్టంగా మారుస్తోంది" అని ఆయన అన్నారు. భవిష్యత్తులో పోటీ స్వరూపం మారనుందని జైశంకర్ అభిప్రాయపడ్డారు. ప్రతి దేశం తమ బలాలు, వనరులతో చర్చలకు వస్తుందని, పరస్పర అవసరాల ఆధారంగా ఒప్పందాలు ఉంటాయని అన్నారు. "చర్చల్లో ఎవరు ఎక్కడ కూర్చుంటారు, ఎవరు గట్టిగా మాట్లాడతారు అనే విషయాలు మారుతాయి. ఈ మార్పుల గురించి నిరాశావాద దృక్పథం అవసరం లేదు" అని ఆయన భవిష్యత్ ప్రపంచ తీరును అంచనా వేశారు.

# గంగపట్నంలో రూ.3.10 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

- శ్రీ చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో రూ.2 కోట్లతో మండపం, నుడా నిధులు రూ.10 లక్షలతో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.1 కోటితో శ్రీ భవానీ సమేత గంగా తారకేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం
- కూటమి ప్రభుత్వ హయాంలో ఆలయాల అభివృద్ధి పనులు వేగవంతం: ఎమ్మెల్యే
- శరన్నవరాత్రుల సందర్భంగా భక్తులకు అన్ని వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశాలు







**నెల్లూరు అక్టోబర్ 14 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామంలో ప్రముఖ ఆలయాల అభివృద్ధి పనులకు కోవూరు శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.3.10 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శ్రీ చాముండేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రూ.2 కోట్లతో మండపం నిర్మాణానికి, నుడా నిధులు రూ.10 లక్షలతో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి, అలాగే రూ.1 కోటి వ్యయంతో శ్రీ భవానీ సమేత గంగా తారకేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అర్చకులు, స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. పండితులు వేదాశీర్వచనం అందించారు.

**శరవేగంగా ఆలయాల అభివృద్ధి పనులు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దైవానుగ్రహంతో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. శ్రీ చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన నాలుగు వసతి గదుల నిర్మాణం, రూ.40 లక్షలతో చేపట్టిన డార్మిటరీ హాల్ నిర్మాణం పూర్తయ్యాయని వెల్లడించారు. అలాగే, దేవస్థాన ప్రాంగణంలో జెడ్పీ నిధులు రూ.85 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు , రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి అందిస్తున్న సహకారం ఎంతో ఉందని ఎమ్మెల్యే తెలిపారు.

**భక్తులకు అన్ని వసతులు కల్పించాలి**

దేవీ శరన్నవరాత్రుల నేపథ్యంలో ఆలయాలకు విచ్చేసే భక్తులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అధికారులకు, ఆలయ ప్రతినిధులకు సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో దైవదర్శనానికి వస్తుంటారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుధ్యం, ఇతర అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శ్రీ భవానీ సమేత గంగా తారకేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఆలయ ధర్మకర్త శ్రీ కొండూరు విజయ్ శేఖర్ రెడ్డి గారిని ఎమ్మెల్యే అభినందించారు.

# పెన్ పవర్
## రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# శ్రీకాళహస్తి కాంగ్రెస్ చైర్మన్ అభ్యర్థిగా గంగపుత్ర గాంధీ..?
## అభ్యర్థిత్వంపై కాంగ్రెస్ వర్గాల్లో చర్చ.. ఇన్‌చార్జి తలప దామోదరం రెడ్డితో మంతనాలు?

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 14:**



శ్రీకాళహస్తి మున్సిపల్ చైర్మన్ పదవిని దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థి ఎంపికపై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు, మాజీ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు, లిరిసిస్ట్ గంగపుత్ర గాంధీ పేరును చైర్మన్ అభ్యర్థిగా పరిశీలిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

గంగపుత్ర గాంధీ కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంగా కొనసాగుతుండటంతో పాటు, మాజీ కౌన్సిలర్ నెల్లూరు రవికుమార్‌కు సోదరుడు కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయన అభ్యర్థిత్వంపై పార్టీ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది.

ఇదే అంశంపై శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తలప దామోదరం రెడ్డితో గంగపుత్ర గాంధీ మంతనాలు జరిపినట్లు సమాచారం. అయితే, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ఆయన పేరును కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

మున్సిపల్ చైర్మన్ పదవికి సంబంధించిన రాజకీయ సమీకరణాలు మారుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎవరికి అవకాశం కల్పిస్తుందన్నది స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ అధిష్ఠానం నిర్ణయం వెలువడితేనే అభ్యర్థిత్వంపై స్పష్టత రానుంది.

# వైసీపీకి ఓటమి భయం... అందుకే ఆరాటం: - మంత్రి నారాయణ ఫైర్

- చట్టప్రకారమే ఎన్నికల ప్రక్రియ: మంత్రి నారాయణ
- రోస్టర్ ప్రకారమే రిజర్వేషన్లు..మంత్రి నారాయణ
- టీవీ లైవ్‌ల కోసమే వైసీపీ ఆరాటం: మంత్రి నారాయణ
- మంచి చేసేవారికే ఓటేయండి: మంత్రి నారాయణ



**నెల్లూరు అక్టోబర్ 14 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

మున్సిపల్ ఎన్నికల ప్రక్రియపై వైఎస్సార్‌సీపీ నేతలు చేస్తున్న అర్థం పర్థం లేని ఆరోపణలపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వార్డుల విభజన, రిజర్వేషన్లు ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా పూర్తి చట్టప్రకారం, పారదర్శకంగా చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, నిబంధనల ప్రకారమే ముందుకు వెళ్లాలని కలెక్టర్‌కు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని ఆయన స్పష్టం చేశారు. డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ బీసీ కోటాలో పోటీ చేయాలనుకున్నంత మాత్రాన రిజర్వేషన్లు మార్చలేదని, రోస్టర్ ప్రకారమే మేయర్ స్థానం ఓసీ జనరల్‌గా ఖరారైందని తెలిపారు. తన నియోజకవర్గంలోనూ పలు డివిజన్ల రిజర్వేషన్లు మారినా తాము జోక్యం చేసుకోలేదని, ఓటమి భయంతోనే వైసీపీ ఉనికి కోసం ఆరాటపడుతోందని ధ్వజమెత్తిన మంత్రి, కేవలం టీవీలలో లైవ్‌లు మరియు పేపర్లలో ఉండాలనే ఉద్దేశంతోనే ఆ పార్టీ నాయకులు నిరాధార విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రశాంత వాతావరణంలో, పూర్తిగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిష్పక్షపాతంగా జరిగే ఈ ఎన్నికల్లో ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొని మంచి చేసే వారికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

# నెల్లూరులో అభివృద్ధి జాతర..









- 4 కోట్లతో పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి నారాయణ
- డిసెంబర్ నాటికి ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్.. నెల్లూరును దోమలు లేని నగరంగా మారుస్తాం: మంత్రి నారాయణ
- రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు 50 వేల కోట్లు
- సీఎం చంద్రబాబు పాలనపై మంత్రి నారాయణ కీలక వ్యాఖ్యలు
- జూన్ 12 నాటికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తి.. నెల్లూరు సిటీలో జోరుగా అభివృద్ధి పనులు

**నెల్లూరు అక్టోబర్ 14 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

నెల్లూరు సిటీ నియోజకవర్గంలో అభివృద్ధి జాతర జోరుగా సాగుతుండగా, నేడు 9 డివిజన్లలో 4 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మంత్రి నారాయణ శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. కూటమి కమిటీ చర్చలు పూర్తయిన తర్వాతే అభ్యర్థుల ప్రకటన ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏకంగా 50 వేల కోట్లు మంజూరు చేశారని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ప్రభుత్వం కూడా ఇంత భారీ మొత్తంలో నిధులు కేటాయించలేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 123 మున్సిపాలిటీల్లో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, గత ప్రభుత్వం రాజకీయ కక్షతో ఆపేసిన అభివృద్ధి పనులన్నింటినీ ఇప్పుడు తిరిగి ప్రారంభించామని పేర్కొన్నారు. నెల్లూరు నగరంలో ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వడంతో పాటు, సంగం బ్యారేజీ నీటిని అందిస్తామని, అలాగే 800 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు వేగంగా జరుగుతున్నాయని, జూన్ 12 నాటికి ఆ పనులన్నీ పూర్తి చేసి నెల్లూరును దోమలు లేని నగరంగా తీర్చిదిద్దుతామని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని పక్కాగా నెరవేరుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత,కార్పొరేషన్ ఎస్ఈ జానీ, హెల్త్ ఆఫీసర్ దినేష్ కుమార్,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు,మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి,డివిజన్ల కూటమి నేతలు పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు అండగా సీఎం సహాయనిధి!
## శ్రీకాళహస్తిలో 28 మంది బాధితులకు రూ.20.94 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**- ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాలతో కార్యక్రమం.. పట్టణ టీడీపీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ నాయుడు ఆధ్వర్యంలో పంపిణీ**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 14:**

అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులను భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక భరోసా లభించింది. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన 28 మంది బాధితులకు మొత్తం రూ.20,94,644 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు.

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు జి. విజయ్‌కుమార్ నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం అప్పులు చేసి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా

సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం బాధిత కుటుంబాలకు కొంత ఊరట కలిగిస్తుందని, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా మరింత ప్రయోజనం చేకూరేలా కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కూటమి కుటుంబ సభ్యులుపాల్గొన్నారు.మొత్తం28మందిలబ్ధిదారులకు రూ.20,94,644 విలువైన చెక్కులు పంపిణీ చేయడం ఈ కార్యక్రమంలో ప్రధానాంశంగా నిలిచింది.



# రాంజీనగర్‌లో జనసేన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన!







- "మేమంతా అదే...కూటమి కే ఓటేస్తాం.. అంటూ ఆత్మీయంగా పలుకరిస్తున్న స్థానికులు..
- నెల్లూరు నగరం లో "నెవర్ బిఫోర్‌డ నెవర్ ఆఫ్టర్" అనే స్థాయిలో అభివృద్ధి ఒక గొప్ప నమ్మకం పొంగూరు నారాయణ ..

కిషోర్ గునుకుల,విజయలక్ష్మి గునుకుల

**నెల్లూరు అక్టోబర్ 14 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

నెల్లూరు నగర కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్ (పాత 16వ డివిజన్) రాంజీనగర్‌లో జనసేన నాయకులు కిషోర్ గునుకుల, వీరమహిళవిజయలక్ష్మి గునుకులఆధ్వర్యంలో గత నెల రోజులుగా కొనసాగుతున్న డోర్ టు డోర్ ఎన్నికల ప్రచారం విజయవంతంగా సాగుతోంది.

ఈ సందర్భంగా ప్రతి గడపను ఆత్మీయంగా పలకరిస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

ప్రచారంలో స్థానికులు ఆత్మీయంగా స్పందిస్తూ, "మేమంతా మీకే ఓటేస్తాం.. మీకు అండగా ఉంటాం" అంటూ తమ మద్దతును తెలియజేయడం జనసేన శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.

ఎన్నో ఆర్థిక ఇబ్బందులు, సవాళ్లతో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం అనేది సినిమాల్లో చూపించినంత సులభం కాదు. దానికి దూరదృష్టి, నిరంతర శ్రమ, బలమైన సంకల్పం, ప్రజల పట్ల అంకితభావం తో ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ ప్రజాసేవా స్ఫూర్తి పాలనలో విలువలకు, బాధ్యతకు, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతను చాటుతోంది....

గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు విజన్‌తో, రాష్ట్ర పునర్నిర్మాణానికి బాటలు పడుతుంది.

నెల్లూరు నగరాన్ని మునుపెన్నడూ లేని రీతిలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మున్సిపల్ శాఖ మంత్రి, నెల్లూరు నగర ఎమ్మెల్యే శ్రీ పొంగూరు నారాయణ కృషి చేస్తున్నారు. నెల్లూరును ఆధునిక స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పాటు, అమరావతి రాజధాని నిర్మాణం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లోనూ రాష్ట్ర అభివృద్ధికి తన వంతు పాత్ర పోషిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కిషోర్ గునుకుల, వీరమహిళ విజయలక్ష్మి గునుకులతో పాటు నాగేంద్ర బాలు, నరహరి, కృష్ణమోహన్ రెడ్డి, మల్లిరెడ్డి, కోటా వెంకటేష్ ,బాలాజీ, సుమంత్,రాజేష్, వీరమహిళలు ప్రవల్లిక, ప్రశాంతి,సుప్రియ,విజయ, ఆమని, శ్రీలక్ష్మి, కృష్ణవేణి, కల్పన, పద్మ, లావణ్య తదితరులు ప్రచారంలో చురుకుగా పాల్గొన్నారు.

# నెల్లూరులో నారీ శక్తి వేడుకగా జె గోల్డ్ జ్యువెలరీ ఎక్స్‌పో







- మంత్రి నారాయణ కుమార్తె షరణి చేతుల మీదుగా జె గోల్డ్ ఎక్స్‌పో ప్రారంభం
- ప్రత్యేక డిజైన్లతో అట్టహాసంగా ప్రారంభమైన జె గోల్డ్ ఎక్స్‌పో







**నెల్లూరు అక్టోబర్ 14 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

మహిళా సాధికారతకు ప్రతీకగా నారీ శక్తి కాన్సెప్ట్‌తో నిర్వహించిన అద్భుతమైన వేడుకలో భాగంగా, రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కుమార్తె పొంగూరు షరణి నెల్లూరు ఆచారి వీధిలోని బార్కాస్ సెంటర్‌లో అక్టోబర్ 14 నుండి 18 వరకు జరగనున్న జె గోల్డ్ ఇన్-స్టోర్ ఎక్స్‌పోను ప్రారంభించారు. ముందుగా రిబ్బన్ కట్ చేసి, ఆ తర్వాత జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆమె అక్కడ ఉన్న డిజైన్లను పరిశీలించి మీడియాతో మాట్లాడారు. మహిళల మనసును హత్తుకునే సరికొత్త తాళి చైన్లు, బ్లాక్ బీడ్స్ (నల్లపూసలు),మంగళసూత్రాలు, గోల్డ్ చైన్లు మరియు డైమండ్ ఆభరణాల ఎక్స్‌క్లూజివ్ కలెక్షన్ ఇక్కడ లభిస్తుందని ఆమె తెలిపారు. ఈ ఆభరణాలన్నీ బయటి నుంచి తెచ్చినవి కాకుండా, మార్కెట్లో ఎక్కడా దొరకని ప్రత్యేకమైన సొంత మ్యానుఫ్యాక్చరింగ్ డిజైన్లతో రూపుదిద్దుకున్నాయని చెప్పారు. కష్టమర్ల నమ్మకమే లక్ష్యంగా, ప్రతి ఒక్కరి బడ్జెట్‌కు సరిపోయేలా బేసిక్, రీజనబుల్ రేట్లతో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో వీటిని అందుబాటులో ఉంచారన్నారు. గత 14 సంవత్సరాలుగా నెల్లూరులో సేవలందిస్తున్న రాహుల్ జైన్ అద్భుతమైన ఆధ్వర్యంలో ఈ సంస్థ ముందుకు వెళ్తోందని కొనియాడారు. అంతేకాకుండా ఈ సందర్భంగా అధికారికంగా వెబ్‌సైట్‌ను కూడా లాంచ్ చేశామని తెలుపుతూ, నెల్లూరు ప్రజలందరూ, ముఖ్యంగా మహిళలు ఈ ఎక్స్‌పోను సందర్శించి డిజైన్లను తిలకించి షాపింగ్ చేయాలని పొంగూరు షరణి పిలుపునిచ్చారు.

## నవరాత్రుల నాలుగో రోజు వైభవం..

### శ్రీ అన్నపూర్ణాదేవిగా కరిమారియమ్మ తల్లి దివ్య అలంకరణ

- భక్తులకు కనువిందు చేసిన అమ్మవారి అలంకారం.. ప్రతి ఇంటా అన్నపూర్ణమ్మ కటాక్షం వెల్లివిరియాలని ప్రత్యేక ప్రార్థనలు

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 14:**

దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శ్రీకాళహస్తి పట్టణంలోని బహదూరుపేట రాతిపనివారి వీధిలో కొలువై ఉన్న శ్రీశ్రీశ్రీ కరిమారియమ్మ తల్లి శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సకల జీవరాశులకు అన్నాన్ని ప్రసాదించే జగన్మాతగా అమ్మవారిని విశేషంగా అలంకరించడంతో ఆ దివ్యరూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపారు. అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకుని భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రతి ఇంటా అన్నపూర్ణమ్మ అనుగ్రహం వెల్లివిరియాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలగాలని భక్తులు మనస్ఫూర్తిగా ప్రార్థించారు. లోకమంతా సుభిక్షంగా ఉండాలని, ఏ ఒక్కరూ



ఆకలితో అలమటించకూడదని అన్నపూర్ణాదేవిని వేడుకున్నారు.

ఈ సందర్భంగా అన్నపూర్ణాదేవిని స్తుతిస్తూ భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అన్నపూర్ణే సదాపూర్ణే శంకర ప్రాణవల్లభే..జ్ఞాన వైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహి చ పార్వతి.. అమ్మవారిని స్మరించి భక్తులు తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మసారపు సుబ్బయ్య, భక్త బృందం పాల్గొన్నారు.

## కల్లూరు సీఐగా బాధ్యతలు స్వీకరించను జి ప్రసాద్ రావు.



**పెన్ పవర్ రొంపిచర్ల మండలం అక్టోబర్ 14**

కల్లూరు నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్గా జి ప్రసాద్ రావు. బుధవారం న అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు

ఈ సందర్భంగా నూతన సిఐ జి ప్రసాద్ రావు ఈ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, అసాంఘిక శక్తులు, మరియు నేరాల నియంత్రణపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

ప్రజలకు, పోలీసు శాఖకు మధ్య సత్సంబంధాలు మెరుగుపరుస్తామని, ఎవరికైనా సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించవచ్చనితెలిపారు.

## నెల్లూరు నగరంలో దూకుడు పెంచిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ..





- కార్పొరేషన్ ఎన్నికల్లో 70వ డివిజన్ అభ్యర్థిగా భాగి వెంకటరమణ పేరును ప్రకటించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి.

**నెల్లూరు అక్టోబర్ 14 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

నెల్లూరు రాంజీ నగర్లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిటీ కార్యాలయంలో 70వ డివిజన్ వైసిపి నాయకులు, కార్యకర్తలతో..వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కార్పొరేషన్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

అనంతరం కార్పొరేషన్ ఎన్నికలకు సంబందించి..70వ డివిజన్ అభ్యర్థిగా భాగి వెంకటరమణ ని.. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రకటించారు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ.., వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. 70వ డివిజన్లో అందరూ సమష్టిగా పనిచేసి భాగి వెంకటరమణను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని పార్టీ నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేశారు. 70వ డివిజన్ను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా నిలబెడతామని తెలిపారు. ఈ సమావేశానికి భారీ సంఖ్యలో హాజరైన..పార్టీ నాయకులు,కార్యకర్తలు.

## గాయత్రి దేవి అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీశ్రీ తాళమ్మ అమ్మవారు



**గూడూరు, పెన్ పవర్, అక్టోబర్,14:**

గూడూరు గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ తాళమ్మ అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండో రోజు అమ్మవారు శ్రీ గాయత్రి దేవి అలంకారంలో భక్తులకు విశేష దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెండో రోజు ఉత్సవాలకు ఉభయకర్తలుగా శ్రీ పామూరు సందీప్సాగరిక దంపతులు, వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. భక్తుల సమక్షంలో పూజా కార్యక్రమాలతో పాటు పల్లకిసేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలను శ్రీశ్రీశ్రీ తాళమ్మ అమ్మవారి దేవస్థానం కమిటీ చైర్మన్ చిట్టెం శ్రీనివాసులు గౌడ్,కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

## రైల్వే సఫాయి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### కనీస వేతనాలు, సెలవులు, బోనస్ చెల్లించాలని సీఐటీయూ డిమాండ్



**గూడూరు, పెన్ పవర్, అక్టోబర్,14:**

గూడూరు జంక్షన్ రైల్వే స్టేషన్ ప్లాట్ఫారమ్లపై పనిచేస్తున్న సఫాయి కార్మికులకు కనీస వేతనాలు, సెలవులు, బోనస్ చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కటారి అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం రైల్వే స్టేషన్లో పనిచేస్తున్న సఫాయి కార్మికులతో ఆయన సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను చర్చించి, వాటి పరిష్కారం కోసం గూడూరు రైల్వే స్టేషన్ మాస్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్మికులకు న్యాయంగా అందాల్సిన వేతనాలు, సెలవులు, బోనస్ తదితర సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ సీఐటీయూ అధ్యక్షుడు పామంజి మణి, కార్యదర్శి బి.వి. రమణయ్యతో పాటు రైల్వే సఫాయి కార్మికులు పాల్గొన్నారు.

## మొలక పోలేరమ్మ"కు ప్రత్యేక పూజలు

**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ అక్టోబర్ 14.**

పట్టణంలోని కరెంట్ ఆఫీస్ ప్రాంతంలో వెలసియున్న "మొలకపోలేరమ్మ" దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాలుగవ రోజైన బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక జే ఆర్ సన్ సిటీ లో నివాసముంటున్న అల్లం రాజేష్, జయమంగళ రాంప్రసాద్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనేకమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమ నిర్వాహకులు రాజేష్, రాంప్రసాద్ లు మాట్లాడుతూ నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు, అలాగే అమ్మవారి కృపాకటాక్షాలుతమకుటుంబాలపైఉండాలనికోరుకుంటున్నామ



న్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో రాజేష్, రాంప్రసాద్ ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## భక్తుల కానుకలతో తాత్కాలిక షెడ్లా?

- 77 లక్షలతో రేకుల షెడ్ల నిర్మాణంపై మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆగ్రహం
- శాశ్వత నిర్మాణాల మాస్టర్ ప్లాన్ను పక్కనపెట్టడమెందుకు?
- నిరుపయోగంగా ఉన్న నిర్మాణాలను ఉచిత డార్మిటరీలుగా మార్చాలి

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 14:**

శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానంలో భక్తులు సమర్పించే కానుకల ద్వారా సమకూరుతున్న నిధులను సద్వినియోగం చేయాలని, దేవస్థానం నిధుల దుర్వినియోగానికి తావులేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆలయ అభివృద్ధి కోసం శాశ్వత నిర్మాణాలతో కూడిన మాస్టర్ ప్లాన్ అందుబాటులో ఉన్నప్పటికీ, అందుకు విరుద్ధంగా రూ.77 లక్షలతో తాత్కాలిక రేకుల షెడ్లు నిర్మించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

**సామాన్య భక్తులకు రాహు-కేతు పూజలు అందుబాటులో ఉండాలి**

శ్రీకాళహస్తి వాయులింగేశ్వర దివ్యక్షేత్రంలో నిర్వహించే రాహు-కేతు పూజలకు ప్రపంచవ్యాప్తంగా విశేష గుర్తింపు ఉందని అంజూరు తారక శ్రీనివాసులు పేర్కొన్నారు.

జాతక దోషాల నివారణ కోసం దేశవిదేశాల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటూ ఈ పూజలు నిర్వహిస్తుంటారని తెలిపారు.

నిరుపేదలు, సామాన్య భక్తుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రూ.500 రుసుముతో నిర్వహించే రాహు-కేతు పూజలను నిరంతరాయంగా కొనసాగించాల్సిన బాధ్యత దేవస్థానం పాలకమండలిపై ఉందన్నారు. భక్తులపై అదనపు ఆర్థిక భారం



పడకుండా, ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**మాస్టర్ ప్లాన్ ఉండగా తాత్కాలిక షెడ్లు ఎందుకు?**

దేవస్థానం అభివృద్ధి కోసం శాశ్వత నిర్మాణాలతో కూడిన మాస్టర్ ప్లాన్ ఇప్పటికే అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. ఆలయంలోని నాలుగో నంబర్ గేటు వద్ద, దేవాలయానికి నైరుతి దిశలో నిబంధనలకు అనుగుణంగా శాశ్వత మండపాలు నిర్మించాల్సి ఉండగా, ఆ ప్రణాళికను పక్కనపెట్టి రూ.77 లక్షల దేవస్థానం నిధులతో తాత్కాలిక రేకుల షెడ్లు ఏర్పాటు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

ప్రఖ్యాత వైదిక సంప్రదాయాలకు నిలయమైన ఈ పవిత్ర పుణ్యక్షేత్రంలో శాశ్వత నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, సినిమా సెట్టింగులను తలపించే విధంగా రేకుల షెడ్లు నిర్మించడం వెనుక ఉన్న ఉద్దేశమేమిటని ప్రశ్నించారు. భక్తుల సౌకర్యాలు, ఆలయ అభివృద్ధి, నిధుల వినియోగం వంటి అంశాల్లో దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

**గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవాలి**

గతంలోనూ దుర్గమ్మ కొండపై టెండర్లు లేకుండా నిర్మించినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న రేకుల షెడ్లు, బుకింగ్ కౌంటర్లు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయనిఅంజూరు తారక శ్రీనివాసులు గుర్తుచేశారు. ప్రజలు, భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో హుండీల్లో సమర్పించే కానుకలను అభివృద్ధి పనులకు వినియోగించేటప్పుడు వాటి అవసరం, ప్రయోజనం, నిర్వహణపై ముందస్తు ప్రణాళిక ఉండాలని సూచించారు.

ఇప్పటికే నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా ఉండకుండా, వాటిని భక్తులకు ఉపయోగపడే విధంగా ఉచిత డార్మిటరీలుగా, విశ్రాంతి కేంద్రాలుగా మార్చాలని కోరారు. దూరప్రాంతాల నుంచి వచ్చే సామాన్య భక్తులకు బస చేసేందుకు సౌకర్యాలు కల్పించడం ద్వారా దేవస్థానం నిధులకు తగిన ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

**నిధుల వినియోగంపై ఉన్నతస్థాయి సమీక్ష జరపాలి**

దేవస్థానం నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. పాలకమండలి అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే, దేవస్థానం ఈవో ఈ అంశాలను తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే సంబంధిత అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి, రూ.77 లక్షలతో చేపట్టిన నిర్మాణాల అవసరం, వాటి ప్రయోజనం, నిధుల వినియోగానికి సంబంధించిన అంశాలపై సమగ్ర పరిశీలన జరపాలని కోరారు.

భక్తుల కానుకల రూపంలో సమకూరే ప్రతి రూపాయిని ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు వినియోగించాల్సిన బాధ్యత దేవస్థానం అధికారులపై ఉందని అంజూరు తారక శ్రీనివాసులు పేర్కొన్నారు. శ్రీకాళహస్తీశ్వర స్వామివారి భక్తుడిగా దేవస్థానం ఈవో ఈ అంశాలపై తక్షణమే స్పందించి, అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు

## రెండో గేటు వద్ద కొత్త ఆటో స్టాండ్తో వివాదాలు వద్దు!

- 30 ఏళ్లుగా జీవనోపాధి పొందుతున్న ఆటో కార్మికులకు ఇబ్బందులు కలిగించొద్దు
- మరో అనువైన ప్రాంతంలో స్టాండ్ ఏర్పాటు చేసుకోవాలి ఏఐటీయూసీ నాయకుల సూచన

**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 14:**

శ్రీకాళహస్తి దేవస్థానం పరిధిలోని రెండో గేటు వద్ద కొత్తగా ఆటో స్టాండ్ ఏర్పాటు చేసే ప్రయత్నాలతో వివాదాలు సృష్టించవద్దని ఏఐటీయూసీ నాయకులు సూచించారు. గత 30 సంవత్సరాలుగా అదే ప్రాంతం నుంచి ఆటోలు నడుపుకుంటూ సుమారు పది గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తూ జీవనోపాధి పొందుతున్న ఆటో కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకూడదని స్పష్టం చేశారు.

శ్రీకాళహస్తి రెండో గేటు నుంచి వేడం, రామాపురం, అబ్బాబట్లపల్లి, భతినయ్య కాలనీ తదితర గ్రామాలకు ఆటోలు నడుపుతూ పలువురు కార్మికులు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. దశాబ్దాలుగా ఇదే ప్రాంతాన్ని ఆధారంగా చేసుకుని ఆటోలు నడుపుకుంటున్న కార్మికుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకోవాలని కోరారు.

అయితే, గత రెండు మూడు రోజులుగా పట్టణంలోని ఇతర ప్రాంతాల్లో ఆటోలు నడుపుతున్న కొంతమంది రెండో గేటు వద్ద కొత్తగా ఆటో స్టాండ్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పరిణామం ఇప్పటికే అక్కడ ఆటోలు నడుపుకుంటూ జీవిస్తున్న కార్మికులకు, కొత్తగా స్టాండ్ ఏర్పాటు చేయాలనుకుంటున్న వారికి మధ్య వివాదాలకు దారితీసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**కార్మికుల మధ్య ఘర్షణలు వద్దు.. ఐక్యతే ముఖ్యం!**

కొత్తగా ఆటో స్టాండ్ ఏర్పాటు చేసుకోవాలనుకునే కార్మికులు, ఇప్పటికే అక్కడ జీవనోపాధి పొందుతున్న వారి పరిస్థితిని అర్థం చేసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు సూచించారు. రెండో గేటు వద్ద కాకుండా, ఇతర ఆటో కార్మికులకు ఇబ్బందులు కలగని అనువైన మరో ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని స్టాండ్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

కార్మికుల మధ్య ఐక్యతను దెబ్బతీసే విధంగా వ్యవహరించకుండా, పరస్పర అవగాహనతో



సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమస్యను ఆటో కార్మికులతో పాటు వారికి మద్దతుగా నిలిచే నాయకుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్మికులందరి జీవనోపాధికి భంగం కలగకుండా, వివాదాలకు తావులేకుండా సమస్య పరిష్కారమయ్యేలా సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రొద్ద గోపి, రైతు సంఘం నాయకులు రాజయ్య, ఆటో కార్మికులు చిట్టిబాబు, రాజశేఖర్, సుబ్రహ్మణ్యం, పెంచలయ్య, జనకయ్య, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూరులో అభివృద్ధికి మరో ముందడుగు

### 6 వార్డుల్లో 9 సీసీ రోడ్లకు శంకుస్థాపన



- ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ సహకారంతో హెచ్ఏఎం నిధులతో పనులకు శ్రీకారం

**గూడూరు, పెన్ పవర్, అక్టోబర్,14:**

గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని చెన్నూరు ప్రాంతంలో 6 వార్డుల పరిధిలోని 9 నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం ఘనంగా శంకుస్థాపన చేశారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో, ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ ప్రత్యేక చొరవ ద్వారా హెచ్ఏఎం నిధులలో గూడూరు మున్సిపాలిటీకి కేటాయించిన రూ.30 కోట్ల నిధులలో భాగంగా చెన్నూరుకి కొన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గూడూరు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ రావు, మరియు టీడీపీ రాష్ట్ర సీనియర్ నాయకులు శీలం కిరణ్ కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మరియు కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బిల్లు చెంచు రామయ్య, జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ రహీం, 24 సొసైటీ అధ్యక్షుడు అల్లూరు కరుణాకర్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు చిన్న వైఎస్సార్, ఇందుకూరు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

మొదటగా కాపు వీధిలోని శ్రీ చెన్నకేశవ స్వామి గుడి వీధిలో టీడీపీ నాయకులందరి చేతుల మీదుగా కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎరుకల కాలనీ, అరుంధతి వాడ, బీసీ కాలనీ, గిరిజన కాలనీ, శెట్టిగారి బీడు, మొదటి హరిజనవాడ, రెండవ హరిజనవాడ, కామాక్షి నగర్ లలో మొత్తం 6 వార్డుల్లో నూతన సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మట్టం శ్రావణి రెడ్డి మాట్లాడుతూ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ సహకారంతో చెన్నూరులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, హెచ్ఏఎం నిధులతో చేపట్టనున్న ఈ రోడ్ల నిర్మాణం స్థానిక ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పిస్తుందని అన్నారు. 24 సొసైటీ అధ్యక్షులు అల్లూరి కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ నూతన సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు.

టిడిపి సీనియర్ నాయకులు చిన్న వైయస్సార్ మాట్లాడుతూ చెన్నూరు లోని వివిధ వార్డులలో నూతన నిర్మాణ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో స్థానికంగా గ్రామస్తుల నుండి హర్షం వ్యక్తం వ్యక్తమవుతోందని అన్నారు.

ఈ అభివృద్ధి పనుల పట్ల చెన్నూరు గ్రామ ప్రజలు మరియు మహిళలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్ఎల్ఏ సునీల్ కుమార్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో శీలం కిరణ్ కుమార్, మట్టం శ్రావణి రెడ్డి, బిల్లు చెంచు రామయ్య, అబ్దుల్ రహీం, కరుణాకర్ రెడ్డి, చిన్న వైఎస్ఆర్, శ్రీకాంత్ రెడ్డి, ఎస్.ఎస్. రెడ్డి, పడాల వెంకటరత్నయ్య, శివారెడ్డి, బీజేపీ నాయకులు అభిలాష్ రెడ్డి, మల్లి శ్యామల, వెడిచర్ల వెంకటేశ్వర్లు, శేఖర్, కృష్ణమూర్తి, శ్రీ ధర్మ రాజులు ఆలయం కమిటీ సభ్యురాలు కుందకూరు మౌనిక, అల్లం కృష్ణయ్య, రాజేంద్ర, అనీల్, హరీష్, శ్రీనివాసులు, మేకల భాస్కర్, చెంచయ్య, అశోక్, రామయ్య, జనసేనాని మధు, మరియు మహిళలు, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు జెడ్పీ సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఎస్. మధుసూదన్కు శుభాకాంక్షలు

### మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీకాళహస్తి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.వి. రమణ

**నెల్లూరు, పెన్ పవర్ ,అక్టోబర్ 14:**

నెల్లూరు జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారిగా (జెడ్పీ సీఈఓ) బాధ్యతలు స్వీకరించిన ఎస్. మధుసూదన్ను శ్రీకాళహస్తి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.వి. రమణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగాశ్రీకాళహస్తీశ్వరస్వామివారితీర్థప్రసాదాలను ఆయనకు అందజేసి, నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ శు



భాకాంక్షలు తెలియజేశారు.

ప్రజాసేవలో భాగంగా జిల్లా పరిషత్ పరిధిలోని అభివృద్ధికార్యక్రమాలువిజయవంతంగా కొనసాగాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా ఎస్.వి. రమణ ఆకాంక్షించారు. శ్రీకాళహస్తీశ్వర స్వామివారి ఆశీస్సులతో ఎస్. మధుసూదన్తన నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కోరుకున్నారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ మన ప్రభుత్వ పిల్లలే విజేతలు పొంగూరు షరిణి

**- ప్రభుత్వ బడుల పిల్లలు క్రీడల్లో అడుగుపెడితే అద్భుతాలు సృష్టిస్తారు**

**- అకడమిక్స్‌తో పాటు స్పోర్ట్స్‌కు ప్రాధాన్యత ఇస్తేనే విద్యార్థులు పరిపూర్ణంగా ఎదుగుతారు**

**- ఎంఎస్ఎం స్కూల్ క్రీడాకారులకు నేనే స్వయంగా స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్, షూస్ అందిస్తాను పొంగూరు షరిణి**

**- జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించిన ఎంఎస్ఎం స్కూల్ క్రీడాకారులకు పొంగూరు షరిణి అభినందనలు.**









**నెల్లూరు అక్టోబర్ 14 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ విశేష కృషితో, ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దే బృహత్తర లక్ష్యంతో ముందుకు సాగుతున్న తరుణంలో... వారి కుమార్తె షరిణి పొంగూరు స్వయంగా రంగంలోకి దిగి ప్రభుత్వ బడుల రూపురేఖలను సమూలంగా మారుస్తూ విద్యార్థులకు కొండంత భరోసానిస్తున్నారు. ఈ అభివృద్ధి బాటలో స్థానిక ఎంఎస్ఎం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌ను సందర్శించిన షరిణి , ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు విద్యాశాఖ తరపున అందిస్తున్న స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ ఇన్ స్పోర్ట్స్ అవార్డును2025-26సంవత్సరానికి గాను ఎంఎస్ఎం పాఠశాల కైవసం చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం ఇక్కడ కనీసం 20 మంది విద్యార్థులు నేషనల్ స్పోర్ట్స్‌కు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, హ్యాండ్ బాల్, సాఫ్ట్‌బాల్, కో-కో, ఆటియా-పాటియా వంటి క్రీడల్లో బాలురు మూడవ స్థానం, బాలికలు రెండవ స్థానం సాధించడమే కాకుండా, లక్నో, జమ్ము అండ్ కశ్మీర్, చండీగఢ్ ప్రాంతాలలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఆరుగురు విద్యార్థులు ఎంపికై పాఠశాల ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయడం పట్ల క్రీడాకారులను అభినందించారు. కేవలం చదువు మాత్రమే కాకుండా క్రీడలకు కూడా సమ ప్రాధాన్యత ఇస్తేనే విద్యార్థులు పరిపూర్ణంగా ఎదుగుతారని గట్టిగా నమ్ముతూ, విద్యార్థులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. అంతేకాకుండా, పాఠశాలలో ఈపీటీఎం ఫ్లోరింగ్ మరియు పీపీ టైల్స్‌తో కూడిన అద్భుతమైన ఇంటర్నేషనల్ స్టాండర్డ్ స్పోర్ట్స్ గ్రౌండ్ ను కేవలం నెల రోజుల్లోగా రెనోవేట్‌చేసి అందిస్తామని ఘంటాపథంగా హామీ ఇవ్వడమే కాకుండా, నేషనల్స్‌కు ఎంపికైన క్రీడాకారులకు అవసరమైన స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్, షూస్ మరియు ఇతర అన్ని వసతులను తాను వ్యక్తిగతంగా సమకూరుస్తానని భరోసానిచ్చారు. మంత్రి నారాయణ ఆశయాలకు రూపమిస్తూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అండగా నిలుస్తున్న షరిణి చొరవపై విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. మురళీకృష్ణ మరియు ఫిజికల్ డైరెక్టర్ పి. అజయ్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## డబ్బు కాదు..
## ప్రజాభిమానమే నాయకత్వానికి అసలైన కొలమానం!

**- స్థానిక ఎన్నికల్లో సామాన్యులకు అవకాశాలు కల్పించాలి**

**- కులమతాలకు అతీతంగా సేవాభావం ఉన్న నాయకులను ప్రోత్సహించాలి: సాయిరాం విప్పరపల్లి**



**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 14:**

ప్రజాస్వామ్యంలో నాయకత్వానికి అసలైన కొలమానం డబ్బు, ఆస్తిపాస్తులు కాదని.. ప్రజల అభిమానం, సేవాభావం, నిజాయితీ, నిబద్ధతేనని సాయిరాంవిప్పరపల్లి అభిప్రాయపడ్డారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలోని ప్రతి వార్డులోనూ ప్రజల కోసం పనిచేయాలనే తపన, సమాజ సేవ పట్ల అంకితభావం, మంచి నాయకత్వ లక్షణాలు కలిగిన సామాన్యులు ఎంతోమంది ఉన్నారని పేర్కొన్నారు.

ఎన్నికల్లో పోటీ చేయడానికి డబ్బు ముఖ్యమా? ప్రజల మద్దతు ముఖ్యమా? అనే ప్రశ్న నేటి రాజకీయ వ్యవస్థలో చర్చనీయాంశంగా మారిందన్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలంటే భారీగా డబ్బు ఖర్చు చేయాల్సిందేననే భావన మారాలని, ఆర్థిక స్థోమత లేని కారణంగా ప్రజాసేవ చేయాలనే ఆసక్తి ఉన్న సామాన్యులు రాజకీయాలకు దూరం కాకూడదని ఆకాంక్షించారు.

ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునే వ్యక్తులు, స్థానిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసే నాయకులకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరారు. కేవలం ఆర్థిక బలం, పలుకుబడి ఆధారంగా కాకుండా.. ప్రజల్లో ఉన్న ఆదరణ, సేవా కార్యక్రమాలు, వ్యక్తిత్వం, నిబద్ధత ఆధారంగా నాయకులను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు సామాన్యులకు ప్రజాసేవలోకి ప్రవేశించే వేదిక కావాలి. ధనవంతులే ఎన్నికల్లో పోటీ చేయగలరు, గెలవగలరు అనే అభిప్రాయాన్ని తొలగించి, ప్రజాబలాన్ని నమ్ముకున్న నిజాయితీపరులకు అవకాశాలు కల్పించాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని పొందిన సామాన్యులను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

అలాగే కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ, సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేసే నాయకత్వాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వాలని, పదవులను అధికార ప్రదర్శనకు కాకుండా ప్రజలకు సేవ చేసేందుకు వినియోగించాలని అన్నారు.

డబ్బుతో ఎన్నికల్లో పోటీ చేయవచ్చు.. కానీ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించాలంటే సేవ చేయాలి! ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునే వారికే నిజమైన నాయకులుగా గుర్తింపు లభిస్తుందని సాయిరాం విప్పరపల్లి పేర్కొన్నారు.ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో సామాన్యులకు అవకాశాలు కల్పించి, ప్రజాబలంతో వారిని గెలిపించడం ద్వారా ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని ఆయన ఆకాంక్షించారు. పదవులు కేవలం డబ్బున్నవారికే పరిమితం కాకుండా, ప్రజల కోసంనిలబడేనిజాయితీపరులకుసైతందక్కాలని పిలుపునిచ్చారు.

## ఐదేళ్లు పార్టీకి దూరంగా ఉన్నవారికి అందలమా?

- కష్టకాలంలో పోరాడిన కార్యకర్తలకు పదవులు దక్కవా?
- స్థానిక సంస్థల ఎన్నికల్లో విధేయతకు గుర్తింపు ఇవ్వాలంటున్న టీడీపీ శ్రేణులు

**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 14:**

తెలుగుదేశం పార్టీ కోసం కష్టకాలంలోనూ అండగా నిలిచి, పార్టీ జెండాను మోస్తూ వైసీపీ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందనే అభిప్రాయాలు పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నాయి. ఐదేళ్లపాటు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండి, క్లిష్ట పరిస్థితుల్లో కార్యకర్తలకు అందుబాటులో లేని వారికి ఇప్పుడు పదవులుకట్టబెట్టేందుకుప్రయత్నాలుజరుగుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన వారికి కాకుండా, కష్టకాలంలో కనిపించని వారికి పదవులు దక్కితే తమ త్యాగాలకు గుర్తింపు ఎక్కడనే ప్రశ్నలు సగటు కార్యకర్తలను వేధిస్తున్నాయి.

**కష్టకాలంలో పార్టీ కోసం నిలిచిన వారిని గుర్తించరా?**

2019లో అధికారం కోల్పోయిన అనంతరం తెలుగుదేశం పార్టీ అనేక రాజకీయ సవాళ్లను ఎదుర్కొంది. ఆ సమయంలో పార్టీ శ్రేణులు వివిధ ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ, వెనుకడుగు వేయకుండా పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నిరసనలు, ఆందోళనల్లో పాల్గొన్న వారు, కేసులు ఎదుర్కొన్న వారు, వ్యక్తిగతంగా నష్టపోయిన వారు తమ వంతు బాధ్యతగా పార్టీకి అండగా నిలిచారు.

అలాంటి వారిని గుర్తించి తగిన గౌరవం కల్పించాల్సిన బాధ్యత పార్టీ నాయకత్వంపై ఉందని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పదవులు ఆశించి రావడం ఒక ఎత్తయితే, ప్రతికూల పరిస్థితుల్లోనూ పార్టీని వీడకుండా నిలబడటం మరో ఎత్తు. అందుకే కష్టకాలంలో పార్టీ కోసం శ్రమించిన వారి సేవలను ప్రస్తుత పదవుల కేటాయింపులో పరిగణనలోకి తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది.

**పోరాడిన వారికి పదవీ యోగం లేదా?**

రాజకీయాల్లో గెలుపోటములు సహజం. అయితే పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు కార్యకర్తలకు అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలను విస్మరించకూడదనే వాదన బలంగా వినిపిస్తోంది. గతంలో వైసీపీ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వారు ఎదుర్కొన్న ఇబ్బందులను, వారి సేవలను నాయకత్వం గుర్తించాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి.

ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ అభ్యర్థుల ఎంపికలో కేవలం రాజకీయ సమీకరణాలకే కాకుండా, పార్టీ పట్ల విధేయత, గతంలో చేసిన సేవలు, ప్రజల్లో ఉన్న పరిచయాలు, కార్యకర్తలతో ఉన్న అనుబంధం వంటి అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నారు. కష్టకాలంలో పార్టీ కోసం నిలిచిన వారికి పోటీ చేసే అవకాశాలు కల్పిస్తే, వారి సేవలకు తగిన గుర్తింపు లభించడంతో పాటు కేడర్‌లోనూనూతనోత్సాహంపెరుగుతుందనిఅభిప్రాయ పడుతున్నారు.

**జెండా మోసిన కార్యకర్తకు న్యాయం జరగాలి!**

పార్టీ గెలుపు కోసం అహర్నిశలు శ్రమించి, తమ వ్యక్తిగత పనులను సైతం పక్కనపెట్టి నాయకుల వెంట నడిచే కార్యకర్తలే ఏ రాజకీయ పార్టీకైనా వెన్నెముక. నాయకుల పిలుపుతో కార్యక్రమాలకు హాజరుకావడం, ప్రచారంలో పాల్గొనడం, ప్రత్యర్థుల విమర్శలను ఎదుర్కోవడం, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి బాధ్యతలను కార్యకర్తలు నిర్వర్తిస్తుంటారు.అలాంటి కార్యకర్తలు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడం, వారి సేవలను గుర్తించడం నాయకత్వం బాధ్యతగా భావించాలి. పార్టీ కోసం జైలు జీవితం గడిపినవారు, దాడులు లేదా అవమానాలు ఎదుర్కొన్నవారు, ఆర్థికంగా నష్టపోయినవారు ఉంటే వారి త్యాగాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పార్టీ శ్రేణులు




కోరుతున్నాయి.

**కార్యకర్తలకు ప్రాధాన్యతే పార్టీకి బలమనే అభిప్రాయం**

పదవులు అనేవి కేవలం రాజకీయ హోదాలు మాత్రమే కాకుండా, పార్టీ కోసం పనిచేసిన వారికి లభించే గుర్తింపుగా కూడా భావిస్తారు. అందువల్ల పదవుల కేటాయింపులో అర్హత, సేవానిరతి, నిబద్ధత, ప్రజాసేవా దృక్పథం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలనే సూచనలు వినిపిస్తున్నాయి.

కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన వారిని పక్కనపెట్టి, పార్టీకి అందుబాటులో లేని వారికి ప్రాధాన్యత ఇస్తే భవిష్యత్తులో కార్యకర్తల నిబద్ధతపై ప్రభావం పడే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పార్టీ కోసం శ్రమించిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు లభించేలా నాయకత్వం నిర్ణయాలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధినేత నుంచి క్షేత్రస్థాయి నాయకుడి వరకు ప్రతి ఒక్కరూ కార్యకర్తల కష్టాన్ని గుర్తించాలి. పదవుల పంపిణీలో పార్టీ కోసం పనిచేసిన వారి సేవలకు ప్రాధాన్యత ఇచ్చినప్పుడే కేడర్‌లో విశ్వాసం మరింత బలపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జెండా మోసిన కార్యకర్తకు గుర్తింపు, కష్టకాలంలో నిలిచిన వారికి గౌరవం, అర్హులైన వారికి పదవుల్లో అవకాశంఇదే పార్టీ శ్రేణుల ప్రధాన ఆకాంక్షగా కనిపిస్తోంది.

## రన్నరప్ జట్టుకు అభినందన, క్యాంప్ ముగింపు క్రీడా దుస్తుల పంపిణీ





**బుచ్చిరెడ్డిపాళెం పెన్ పవర్ అక్టోబర్ 14.**

బుచ్చిరెడ్డిపాళెంలోని డి . ఎన్ .ల్ .ఆర్. హైస్కూల్ ప్రాంగణంలో బుధవారం నాడు కబడ్డీ క్రీడకు సంబంధించిన మూడు ప్రధాన కార్యక్రమాలను ఒకే వేదికపై అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా నూజివీడులో ఈ నెల 10, 11, 12 తేదీల్లో జరిగిన 36వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో అద్భుత ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానాన్ని (రన్నరప్) సాధించిన నెల్లూరు జిల్లా బాలుర జట్టును ఈ సందర్భంగా ఘనంగా సత్కరించి అభినందించారు.

అలాగే ఈ నెల 16, 17, 18 తేదీలలో ప్రకాశం జిల్లా మార్కాపురంలో నిర్వహించనున్న 52వ జూనియర్స్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల కొరకు నెల్లూరు జిల్లా జట్లకు డి . ఎన్ ఎల్ ఆర్ హైస్కూల్‌లో ఈ నెల 5వ తేదీ నుండి 14వ తేదీ వరకు (10 రోజుల పాటు) నిర్వహించిన ప్రత్యేక శిక్షణ శిబిరం (కోచింగ్ క్యాంపు ) బుచ్చికి చెందిన సీనియర్ క్రీడాకారుడు పి. సుధీర్ మరియు వారి మిత్ర బృందం, సీనియర్ కబడ్డీ క్రీడాకారుల ఆధ్వర్యంలో నేటితో విజయవంతంగా ముగిసింది. శిక్షణ ముగింపు అనంతరం, మార్కాపురం రాష్ట్ర పోటీలకు బయలుదేరుతున్న నెల్లూరు జిల్లా జూనియర్ పురుషుల (బాలుర) మరియు మహిళల (బాలికల) జట్లకు ఉచితంగా క్రీడా దుస్తులను (స్పోర్ట్స్ కిట్స్ ) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సబ్ జూనియర్స్ సాధించిన విజయం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో 10 రోజుల శిక్షణను ఉపయోగించుకుని మార్కాపురం రాష్ట్ర పోటీల్లో పురుషుల, మహిళల జట్లు రెండూ కూడా విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ త్రివిధ వేడుకలో ఎస్సై ఉమా శంకర్ చేతుల మీదుగా టీ షర్ట్స్ పంపిణీ చేశారు నెల్లూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి. హరీష్, సెక్రటరీ జి. సతీష్, బుచ్చిరెడ్డిపాళెం టిడిపి నాయకులు, సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు (ఫిజికల్ డైరెక్టర్స్ ), కోచ్‌లు మరియు వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో విచ్చేసిన క్రీడాభిమానులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉపాధ్యాయులు కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు

## రైతుల భూమికి రాజముద్రతో భరోసా.. ఇందుకూరుపేటలో పాసు పుస్తకాల పంపిణీ పూర్తి

**- గంగపట్నం, రాముడిపాళెంలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేసిన కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి లి**

**- ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు 'మీ భూమి మీ హక్కు' కార్యక్రమం అమలు**

**- ఇందుకూరుపేట మండలంలోని 16 గ్రామాలకు 8,394 కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు**

**- గంగపట్నం, రాముడిపాళెం గ్రామాల్లో 1,251 మంది రైతులకు పాసు పుస్తకాల పంపిణీ**

**- మండలంలో రీ-సర్వే ప్రక్రియతో పాటు పాసు పుస్తకాల పంపిణీ పూర్తి**







**నెల్లూరు అక్టోబర్ 14 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

రైతుల భూమిపై హక్కులను ధ్రువీకరిస్తూ, రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను అందించాలన్న ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు హామీ మేరకు 'మీ భూమి మీ హక్కు' కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని కోవూరు శాసనసభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. బుధవారం ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం, రాముడిపాళెం గ్రామాల్లో 1,251 మంది రైతులకు ఎమ్మెల్యే గారు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. మండలంలోని 16 గ్రామాలకు మొత్తం 8,394 పాసు పుస్తకాలు మంజూరయ్యాయని, దీంతో మండలంలో రీ-సర్వే ప్రక్రియతో పాటు పాసు పుస్తకాల పంపిణీ కూడా పూర్తయిందని వెల్లడించారు.

**రైతుల భూ హక్కులకు భరోసా**

గతంలో భూముల విషయంలో చోటుచేసుకున్న అవకతవకలను రీ-సర్వే ద్వారా సరిచేస్తూ, రైతులకు వారి భూములపై హక్కులను ధ్రువీకరించే పట్టాదారు పాసు పుస్తకాలను ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**

రైతులందరూ సుభిక్షంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా వరుణ యాగాలు నిర్వహించినట్లు తెలిపారు. గత కొద్ది రోజులుగా




వర్షాలు కురుస్తుండటంపై సంతోషం వ్యక్తం చేశారు. గత సీజన్‌లో మంచి దిగుబడులు రావడంతో రైతులకు మెరుగైన ఆదాయం లభించిందని గుర్తుచేశారు. ఈ సీజన్‌లోనూ సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండి రైతులకు మంచి దిగుబడులతో పాటు మెరుగైన ఆదాయం లభించాలని ఆకాంక్షించారు.

## బాలికల కళాశాల వద్ద ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి!

**- స్వర్ణముఖి కట్టపై అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించాలి**

**- నూతన డీఎస్పీ పావనిని కలిసి సమస్యలను వివరించిన కాంగ్రెస్ నేతలు**



**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 14:**

శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పావనిని కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు డీఎస్పీని కలిసి పట్టణంలో నెలకొన్న పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ.. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని బాలికల జూనియర్ కళాశాల వద్ద ఆకతాయిల ఆగడాలు పెరుగుతున్నాయని, దీంతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొంటున్నాయని తెలిపారు. విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ కళాశాల పరిసరాల్లో పోలీసుల నిఘాను పెంచాలని కోరారు.

అదేవిధంగా పట్టణంలోని స్వర్ణముఖి కట్ట ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోందని డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా ప్రాంతాల్లో పోలీసుల పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా మహిళలు, విద్యార్థినులు భయాందోళనలు లేకుండా సంచరించేలా భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు.

కాంగ్రెస్ నాయకులు ప్రస్తావించిన సమస్యలపై డీఎస్పీ పావని సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, జిల్లా ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సుధా యాదవ్, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆంటోనీతో పాటు నాగరాజు, మహేష్, అరుణ్, చరణ్, జోసెఫ్, సారధి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మ సేవలో లింగారెడ్డి లక్ష్మారెడ్డి
### అమ్మవారి అలంకరణ కోసం రూ.1.60 లక్షల విలువైన సామగ్రి విరాళం






**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 14:**
శ్రీకాళహస్తీశ్వరస్వామివారి దేవస్థాన అనుబంధ ఆలయమైన కనకాచలంపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గాదేవి అమ్మవారికి శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన లింగారెడ్డి లక్ష్మారెడ్డి భక్తిశ్రద్ధలతో రూ. 1,60,000 విలువైన అలంకరణ సామగ్రిని విరాళంగా అందజేశారు.
అమ్మవారి అలంకరణలకు ఉపయోగపడే ఈ సామగ్రిని దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈఓ) బి.కె. వెంకటేశు లు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్‌లకు అందజేశారు.
దైవభక్తితో అమ్మవారి సేవకు ముందుకొచ్చి విలువైన అలంకరణసామగ్రినివిరాళంగాఅందించడంఅభినందనీయ మని పలువురు పేర్కొన్నారు. భక్తులు అందించే విరాళాలు ఆలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## మద్యం మత్తులో అదుపుతప్పిన స్కూటీ



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ అక్టోబర్ 14.**
బుచ్చిరెడ్డిపాలెం మండలం పెనుబల్లి గ్రామం సమీపంలోని రైస్ మిల్లు మలుపు వద్ద నెల్లూరు నుంచి స్కూటీపై వస్తున్న వ్యక్తి మద్యం మత్తులో అదుపుతప్పి రోడ్డు మార్జిన్ వద్ద పడిపోయాడు అటువైపుగా వెళుతున్న నర్సులు గమనించి 108 అంబులెన్స్ కి ఫోన్ చేసి గాయాలపాయాలైన వ్యక్తిని పెనుబల్లిలోని పి హెచ్ సి కు తరలించారు. సదరు వ్యక్తి శ్రీనివాసులు గా బుచ్చిరెడ్డిపాలెం శాంతినగర్ నివాసితుడు గా గుర్తించారు

## ఉద్యానవన పథకాల కోసం రైతులు రిజిస్ట్రేషన్లు: సంతోష్ కుమారి.



**పెన్ పవర్ రొంపిచర్ల మండలం అక్టోబర్ 14**
గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌లో భాగంగా రైతులకు వివిధ ఉద్యానవన పథకాల కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 17వ తేదీ వరకు రైతులు తమకు అవసరమైన పథకాల కోసం నమోదు చేసుకోవచ్చు ఉద్యానవన అధికారి సంతోషకుమారి తెలియజేశారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు కొత్త పండ్ల తోటల ఏర్పాటు కొబ్బరి, ఖర్జూరం, ఆపిల్, మామిడి, జామ, దానిమ్మ, అరటి, బొప్పాయి వంటి పంటలు.పాత మామిడి తోటల పునరుద్ధరణ.పంటల కోత అనంతర మౌలిక సదుపాయాలు
కలెక్షన్‌సెంటర్లు,ప్యాక్‌హౌసులు,కోల్డ్‌రూములు,ప్రాసెసింగ్ యూనిట్లు,పాలీహౌసులు, పవర్ టిల్లర్లు,బ్యాటరీ స్ప్రేయర్లు,మినీ ట్రాక్టర్లు, టార్పాలిన్ పట్టలు,ఫారం పాండ్లు ప్లాస్టిక్ క్రేట్లు, అందిస్తారని అర్హత కలిగిన రైతులు తమకు అవసరమైన పథకాలను ఎంపిక చేసుకుని, అక్టోబర్ 17వ తేదీలోపు తమ సమీప రైతు సేవా కేంద్రాన్ని ( ఆర్.ఎస్.కె ) సంప్రదించాలి.రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్ మరియు బ్యాంకు ఖాతా వివరాలను సమర్పించి నమోదు చేసుకోవాలి.రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యానవన రంగ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సంతోషి కుమారి కోరుతున్నాము

## 30వ వార్డులో రూ.10.90 లక్షలతో సీసీ కాలువ నిర్మాణం
### రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన రుషితారెడ్డి



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 14:**
శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలోని 30వ వార్డు రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో రూ. 10.90 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ కాలువ నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి రుషితారెడ్డి, మున్సిపల్ కమిషనర్ పాల్గొని పనులకు శ్రీకారం చుట్టారు.
కాలనీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన పారిశుధ్య సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో ఈ కాలువ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. సీసీ కాలువ నిర్మాణం పూర్తయితే మురుగునీటి పారుదలకు ఇబ్బందులు తగ్గి, స్థానికులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.
స్థానిక ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు, కాలనీల్లో పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన వాతావరణాన్ని కల్పించవచ్చని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ, ఏఈ, వార్డు ఇన్‌చార్జి, వార్డు సభ్యులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులపై కమిషనర్ తనిఖీ:పరిశుభ్రతలో నిర్లక్ష్యం వద్దు.. సిబ్బందికి బి. శేషన్న సూచనలు



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 14**
నంద్యాల పట్టణంలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడంపై మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.పట్టణంలో వీధులు, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యానికి తావివ్వకూడదని సిబ్బందికి సూచించారు. చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య నిర్వహణను పర్యవేక్షించాలని ఆదేశించారు. పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ తనిఖీల్లో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, పారిశుధ్య పర్యవేక్షకులు లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళి పక్కాగా అమలు చేయాలి
### అధికారులకు కలెక్టర్ రాజకుమారి ఆదేశాలు



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబరు 14**
స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళిని జిల్లావ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎన్నికల ఏర్పాట్లపై సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.
ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న రాజకీయ ప్రచార చిత్రాలు, హోర్డింగ్‌లు, బ్యానర్లు, ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని సూచించారు. ప్రభుత్వ వాహనాలు, వనరులను ఎన్నికల ప్రచారానికి వినియోగించకూడదని స్పష్టం చేశారు. కొత్త అభివృద్ధి పనుల మంజూరు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల విషయంలో ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలన్నారు. ప్రైవేట్ ఆస్తులపై ప్రచార సామగ్రి ఏర్పాటు చేయాలంటే యజమానుల అనుమతి తప్పనిసరని తెలిపారు.
నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలకు షెడ్యూల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రచార వాహనాలు, బహిరంగ సభలు, ర్యాలీలు, లౌడ్‌స్పీకర్ల వినియోగానికి సంబంధిత అనుమతులు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, సామాజిక మాధ్యమాల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో అధికారులు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎన్నికల సంఘం ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్వో రాము నాయక్, ఏఓ సుభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రైతు బజార్‌కు హోల్‌సేల్ దెబ్బ
### టెక్కె మార్కెట్ యార్డులో వ్యాపారంపై రైతుల ఆవేదన




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 14**
టెక్కె మార్కెట్ యార్డులో కొనసాగుతున్న హోల్‌సేల్ కూరగాయల వ్యాపారం వల్ల రైతు బజార్‌లో కూరగాయలు విక్రయించే రైతులకు తీవ్ర నష్టం కలుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాంధీచౌక్‌లో వ్యాపారం చేస్తున్న కొందరు టెక్కె మార్కెట్ యార్డులో హోల్‌సేల్ కూరగాయల వ్యాపారం నిర్వహిస్తుండటంతో రైతు బజార్‌లో తమ వ్యాపారం దెబ్బతింటోందని వాపోతున్నారు.
పంటలు పండించేందుకు పెట్టుబడులు పెట్టి, రవాణా ఖర్చులు భరించి రైతు బజార్‌కు కూరగాయలు తీసుకొస్తున్న తమకు ఆశించిన గిరాకీ లభించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సాగు ఖర్చులతో సతమతమవుతున్న తమకు వ్యాపారం తగ్గడం మరింత భారంగా మారుతోందని పేర్కొంటున్నారు.
టెక్కె మార్కెట్ యార్డులో జరుగుతున్న హోల్‌సేల్ కూరగాయల వ్యాపారంపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలన జరపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతు బజార్‌లో తమ వ్యాపారానికి విఘాతం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
రైతుల ప్రయోజనాలను కాపాడటంతోపాటు, వారు పండించిన కూరగాయలకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
రైతు బజార్‌లో రైతుల ఉపాధికి భరోసా కల్పించేలా అధికారులు తక్షణమే స్పందించాలని రైతులు కోరుతున్నారు.

## కూటమి విజయమే లక్ష్యం
### స్థానిక ఎన్నికలపై మంత్రుల సమీక్ష



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 14**
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మంత్రులు పయ్యావుల కేశవ్, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు.
నంద్యాలలోని జయంత వెజ్ వరల్డ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రులు పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.
ఈ సమావేశంలో టీడీపీ పరిశీలకులు ప్రభాకర్ చౌదరి, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరు చరిత రెడ్డి, భూమా అఖిలప్రియ రెడ్డి, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, గీతా జయసూర్య, ఎన్ఎండీ ఫిరోజ్, భూమా విఖ్యాత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంల భద్రతపై కలెక్టర్ తనిఖీ



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 14**
ఈవీఎం గోదాముల భద్రతలో నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. నంద్యాల టెక్కె మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదాములను బుధవారం కలెక్టర్ తనిఖీ చేశారు. గోదాముల తాళాలు, సీల్స్, సీసీటీవీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాలు, పోలీసు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పటిష్ట భద్రత కల్పించాలని, సీసీటీవీలు నిరంతరం పనిచేసేలా చూడాలని సూచించారు.
ఈ తనిఖీల్లో సబ్ కలెక్టర్ మనీషా, జిల్లా రెవెన్యూ అధికారి డి. రామునాయక్, తహసీల్దార్ సత్య శ్రీనివాసులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



## జెడ్పీ సీఈఓగా శివశంకర్

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 14**
నంద్యాల జిల్లా పరిషత్ నూతన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా (సీఈఓ) శివశంకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది శివశంకర్‌కు అభినందనలు తెలిపారు.

## నంద్యాలలో రావుస్ నూతన క్యాంపస్
### మంత్రి ఫరూక్, ఎంపీ శబరి చేతుల మీదుగా ప్రారంభం



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 14**
నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్‌లో అత్యాధునిక వసతులతో నిర్మించిన రావుస్ ఐఐటీజేఈఈ, నీట్ శిక్షణ కేంద్రాన్ని రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ప్రారంభించారు.
ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటు ధరల్లో నాణ్యమైన విద్య అందించడం అభినందనీయమన్నారు. గత 30 ఏళ్లుగా విద్యారంగంలో సేవలందిస్తున్న కళాశాల చైర్మన్ ఏఎంవీ అప్పారావును అభినందించారు. నంద్యాల విద్యారంగానికిఆయనచేసినసేవలుప్రశంసనీయమన్నారు.
కళాశాల చైర్మన్ అప్పారావు మాట్లాడుతూ, కార్పొరేట్ స్థాయి వసతులతో స్థానిక విద్యార్థులకు జాతీయ స్థాయి ఐఐటీజేఈఈ, నీట్ శిక్షణ అందించడమే తమ లక్ష్యమన్నారు. డిజిటల్ తరగతి గదులు, ఏసీ గదులు, ఆధునిక ప్రయోగశాలలు, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్ వంటి సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఇతర నగరాలకు వెళ్లి అధిక ఖర్చులు చేయకుండా నంద్యాలలోనే నాణ్యమైన శిక్షణ పొందవచ్చన్నారు.
కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామచంద్రరావు, ఏవీఆర్ ప్రసాద్, సురేష్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రొడ్డా సుంకయ్య, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ట్వీట్లతో పోటీ... లెక్క తేల్చేస్తున్న పెద్దలు

**విజయవాడ అక్టోబరు 14 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో అధికార ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు , పవన్ కల్యాణ్ పరిపాలనాపరంగా ఎలాంటి విభేదాలు లేకపోయినా.. క్షేత్రస్థాయిని శాసించే సోషల్ మీడియా వేదికలపై మాత్రం నిత్యం అగ్గిరాజేస్తూనే ఉంది. ఇరు పార్టీల అధినేతలు భేటీ అవుతూ సమన్వయంతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నప్పటికీ, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో రెండు పార్టీల కార్యకర్తలు, సానుభూతిపరులు పరస్పరం చేసుకుంటున్నవిమర్శలు తారాస్థాయికి చేరుతున్నాయి .పవన్ కల్యాణ్ ఏదైనా వ్యాఖ్య చేసిన తర్వాత టీడీపీ సోషల్ మీడియా విభాగాలు భావోద్వేగాలతో రియాక్ట్ కావడం, దానికి ప్రతిగా జనసేన సైనికులు గత త్యాగాలనుగుర్తుచేస్తూ విరుచుకుపడటం పరిపాటిగా మారింది. అటు కాకినాడ, పిఠాపురం నుంచి మొదలుకొని విశాఖ పెందుర్తి వంటి చోట్ల వరకు ఫ్లెక్సీల వివాదాలు, స్థానిక ఆధిపత్య పోరును సోషల్ మీడియావేదికలకు ఎక్కించి ట్రోలింగ్ వార్ నడుపుతున్నారు. నాయకత్వం చెప్పే విధానపరమైన ప్రకటనల కంటే.. యూట్యూబ్ తంబ్‌నెయిల్స్, సోషల్ మీడియా రీల్స్‌లోని కట్ క్లిప్పింగులకే కార్యకర్తలుప్రాధాన్యతనిస్తూ ఒకరినొకరు కించపరుచుకునే స్థాయికి దిగజారుతున్నారు.ఇదే సమయంలో రాబోయే స్థానిక

సంస్థల సమరానికి సంబంధించి సీట్ల పంపకాల లెక్కలను పార్టీ పెద్దల కంటే ముందే ఈ కీబోర్డ్‌వారియర్స్ తేల్చేస్తుండటం మరింత హాస్యాస్పదంగా మారింది. 17 కార్పొరేషన్లు, 106 మున్సిపాలిటీల రిజర్వేషన్లు ఖరారైన వేళ.. ఏ సీటు తమకే దక్కాలి, ఎవరు ఎక్కడ త్యాగం చేయాలనే దానిపై సోషల్‌మీడియాలోనే ఎవరికి వారే జాబితాలు విడుదల చేసుకుంటున్నారు. విజయవాడ, విశాఖ, కాకినాడ మేయర్ సీట్లతో పాటు కీలక మున్సిపాలిటీలను జనసేనకే ఇవ్వాలని కొందరు, టీడీపీ సంప్రదాయ ఓటుబ్యాంకు ప్రకారం మెజారిటీ స్థానాలు తమకే ఉండాలని మరికొం దరు సొంత సిద్ధాంతాలు వండి వారుస్తున్నారు. పెద్దలు కూర్చుని

ఒక ఒప్పందానికి వస్తారన్న కనీస ఇంగితం లేకుండా.. ఎవరికి ఎన్ని సీట్లుకేటాయించాలన్న దానిపై వీరే లెక్కలు కడుతూ కూటమి మైత్రిని విషమించేలా చేస్తున్నారు.ఈ తరహా వర్గపోరు అంతిమంగా ప్రతిపక్షానికి రాజకీయ అస్త్రంగా మారుతుందన్న స్పృహ కేడర్‌లో లోపిస్తోంది.పార్టీల అధిష్ఠానాలు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా, ఫేక్ అకౌంట్ల ప్రచారాలను నమ్మవద్దని హెచ్చరించినా.. సోషల్ మీడియాలో ముఠా కక్షల తరహాలో సాగుతున్న ఈ డిజిటల్ వార్ ఆగడం లేదు. ఒకవైపునాయకులు ఐక్యతను ప్రదర్శిస్తుంటే, మరోవైపు కార్యకర్తలు ఇలా కయ్యానికి కాలుదువ్వడం కూటమి క్షేత్రస్థాయి ఓటు బదిలీపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదముంది.

# మనమిత్ర ద్వారా కుల ధృవీకరణ పత్రాలు..

## మొబైల్ ద్వారానే డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం

**విజయవాడ అక్టోబరు 14 పెన్ పవర్:**

ఏపీ ప్రభుత్వం చాలా పనులను ఆన్‌లైన్ ద్వారా చేసుకునే వెసలుబాటు కల్పించింది. తాజాగా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా తమ కుల ధృవీకరణ పత్రాలు పొందే సదుపాయాన్ని కల్పించినట్లురియల్ టైమ్ గవర్నెన్స్ అధికారులు తెలిపారు. పౌరులు తమ కుల ధృవీకరణ పత్రాలలు కావాల్సినప్పుడు ఏ ప్రభుత్వ ఆఫీసులకు వెళ్లనవసరం లేదు. తాము ఉన్న చోటు నుంచే తమ మొబైల్‌ఫోన్ ద్వారాడౌన్‌లోడు చేసుకోవచ్చని ఆర్టీజీఎస్ రాష్ట్ర ప్రజలకు సూచించింది. మనమిత్రలోని రెవెన్యూ సేవల విభాగంలో పౌరులు రీ ఇష్యూయెన్స్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్స్ సెక్షన్ ఎంపిక చేసుకోవాలి. అందులో తమ ఆధార్ నంబరు ఎంటర్ చేసి, దాంతో ఓటీపీ పొందాలి. ఈ ఓటీపి అందులో నమోదు చేసిన తర్వాత కొన్ని వివరాలను మీరు ఫిల్ చేయాలి. తర్వాత మీరు క్యాస్ట్ సర్టిఫికెట్ పొందడానికి కావాల్సిన 40రూపాయలు రుసుమును వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే చెల్లించాలి. ఒకసారి చెల్లింపు అయిన తర్వాత వాట్సాప్‌లో మీ కుల ధృవీకరణ పత్రం డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇప్పటికే కులానికి సంబంధించినపత్రాలు జారీ అయిన వారు తమ సర్టిఫికెట్లను వాట్సాప్ ద్వారా తమకు కావాల్సిన సమయంలో కావాల్సినప్పుడు డౌన్లోడు చేసుకోవచ్చు. ప్రతిసారి కుల ధృవీకరణ పత్రాల కోసం రెవెన్యూ ఆఫీసులు, స్వర్ణగ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ సదుపాయం ఇప్పటికే క్యాస్ట్ సర్టిఫికెట్ పొందినవారికి కల్పిస్తున్నామని..త్వరలో మనమిత్ర ద్వారా కొత్తగా కుల ధృవీకరణకు అప్లై చేసుకుని పొందే సదుపాయం కూడా కల్పించనున్నట్లు ఆర్టీజీఎస్ ఓ ప్రకటనలో తెలిపింది. మీరు ఏపీ పౌరుడు అయితే మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ నంబరు 9552300009 కు ఎఱ (హాయ్) అని మెసేజ్ పంపాలి మీకు కావాల్సిన సర్వీసును ఎంచుకోవడం ఆప్షన్ పైన క్లిక్ చేయండి ఆ తరువాత రెవెన్యూ సేవల ఆప్షన్ ఎంపిక చేసుకోవాలిరీ-ఇష్యూయెన్స్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు ఆప్షన్ మీరు సెలక్ట్ చేసుకోవాలి మీ ఆధార్ నంబర్ ఎంటర్ చేయాలి. మీ మొబైల్ కు ఓటీపీ వస్తుంది.మీ రిజిస్టర్ అయిన మొబైల్‌కు వచ్చిన ఓటీపీనిఅడిగిన చోట టైపు చేయాలి ఆధార్ డెమోగ్రాఫిక్స్ రివ్యూలో అడిగిన వివరాలన్నీ నమోదు చేయాలి కుల ధృవీకరణ పత్రం పొందడానికి రూ.40 చెల్లించాలి ఈ నగదు చెల్లించడానికి ఉన్న పేమెంట్ గేట్ వేద్వారా మాత్రమే మీరు చెల్లించాలి: మీ కుల ధృవీకరణ పత్రం పీడీఎఫ్ డౌన్ లోడ్ అని వస్తుంది: మీ ఝుర్వ జవతీఱటఱఝ్ఖేవ మీరు ప్రింట్ ఔట్ తీసుకోవచ్చు లేదా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

# దిగుమతి రాజకీయం.. జనసేన నయా ట్రెండ్!




**విజయవాడ అక్టోబరు 14 పెన్ పవర్:** రాజకీయాల్లో కుప్పిగెంతులు ఉంటాయి. ఆ పార్టీ నుంచి ఈ పార్టీకి.. ఈ పార్టీ నుంచి ఆ పార్టీ నాయకులు మారడం అత్యంత సహజం. ముఖ్యంగా విపక్షంలో ఉన్న నేతలు అధికారంపై మోజుతో రూలింగ్ పార్టీల్లో చేరడం చాలా ఎక్కువగా జరుగుతుంటుంది. కానీ, ఏపీలో ఈ తరహా రాజకీయాలకు భిన్నమైన విధంగా దిగుమతి రాజకీయం నడుస్తోందని అంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూటమిగా ఏర్పడిన టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు తమకు అవసరమైన నాయకులను ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి దిగుమతి చేసుకోవడమే ఈ ట్రెండ్ అంటున్నారు. ఇందుకు తాజా ఉదాహరణగా తాజాగా జనసేన కండువా కప్పుకున్న మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ ఉదంతాన్ని సూచిస్తున్నారు.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ జనసేనలో చేరడంతో ఈ చర్చ మరింత ఎక్కువ అయింది. గత కొన్నిరోజులుగా రాధాకృష్ణ జనసేనలో చేరతారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే ఆయన ప్రస్తుతం ఉన్న టీడీపీలో అసంతృప్తి లేదా అసౌకర్యం కారణంగా పార్టీ మారకపోవడమే ఇక్కడి విశేషంగా చెబుతున్నారు. రాజకీయ అవసరాల రీత్యా టీడీపీ నుంచి రాధాకృష్ణను జనసేనను దిగుమతి చేసుకుందని పొలిటికల్ ఎనలిస్టులు చమత్కరిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి కొనసాగుతున్న ఈ ట్రెండ్ ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో మరింత ఎక్కువయ్యే అవకాశం ఉందని అంటున్నారు.

విజయవాడ మేయర్ పదవిని ఆశిస్తున్న జనసేన తమ పార్టీలో సమర్థుడైన నేత లేరన్న కారణంతో టీడీపీ నుంచి రాధాకృష్ణను తమ పార్టీలోకి తెచ్చుకుందని చెబుతున్నారు. దీనిద్వారా కూటమి పార్టీలు మూడు తమకు అవసరమైన చోట అవసరమైన అభ్యర్థుల కోసం అభ్యర్థులను బదిలీ చేసుకునే కొత్త సంస్కృతి తీసుకువచ్చాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సమయం లేకపోవడం వల్ల ఈ పద్ధతి అనుసరించారని భావించినప్పటికీ, అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల తర్వాత కూడా అదే విధానాన్ని అనుసరించడమే ఆశ్చర్యానికి గురిచేస్తోందని అంటున్నారు. తమ పార్టీకి ఫలానా పదవి కావాలని కోరుకుంటున్న పార్టీల అగ్రనాయకత్వాలు ముందుగా ఆయా చోట్ల సమర్థులైన నాయకులు తయారు చేసుకోలేకపోవడాన్ని ఎత్తిచూపుతున్నారు.ఇక టీడీపీ నుంచి జనసేనలో చేరడం ద్వారా మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ దిగుమతి రాజకీయాలు 2.0కి తెరతీశారని వ్యాఖ్యానిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే విధంగా పలువురు నేతలు టీడీపీ నుంచి జనసేన, బీజేపీల్లోకి వెళ్లి ఎమ్మెల్యేలు అయిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ప్రధానంగా పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, భీమవరం ఎమ్మెల్యే రామాంజనేయులు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ టీడీపీ నుంచి జనసేనలో చేరి ఎమ్మెల్యే సీట్లు పొందారని చెబుతున్నారు. ఇదే లిస్టులో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి టీడీపీ నుంచి బీజేపీలోకి వెళ్లినట్లుగా చూపుతున్నారు. ఇప్పుడు మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ ద్వారా మొదలైన దిగుమతి రాజకీయాలు ఎందరికి పదవీ యోగం ప్రసాదిస్తుందో చూడాల్సివుందని అంటున్నారు.

# విశాఖ మేయర్ పీఠంపై తెర పైకి బాలయ్య కూతురి పేరు

**విశాఖపట్నం, అక్టోబరు 14 పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విశాఖపట్నం మేయర్ పదవికి ప్రత్యేక గుర్తింపు ఉంది. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, నగర ప్రాధాన్యం, భారీ బడ్జెట్ కారణంగా ఈ పదవిని దక్కించుకోవాలనిరాజకీయ నాయకులు ఆసక్తి చూపుతుంటారు. తాజాగా మేయర్ పదవికి మహిళా రిజర్వేషన్ ఖరారైనట్లు ప్రచారం జరగడంతో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. అధికార కూటమితో పాటు వైఎస్సార్‌సీపీ కూడా బలమైన అభ్యర్థుల కోసం అన్వేషిస్తున్నట్లు చర్చ సాగుతోంది. ముఖ్యంగా టీడీపీకి చెందిన ప్రముఖ కుటుంబాల మహిళల పేర్లు తెరపైకి రావడం ఆసక్తిని పెంచుతోంది.విశాఖ మేయర్‌పదవి మరోసారి మహిళకు దక్కనుండటంతో మహిళా నాయకుల మధ్య పోటీ పెరిగే అవకాశం కనిపిస్తోంది. 2021లో జరిగిన మేయర్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బీసీ వర్గానికి చెందిన గొలగాని హరివెంకట కుమారి బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు కూడా మహిళా అభ్యర్థికే అవకాశం ఉండటంతో పార్టీలు సామాజిక సమీకరణాలు, రాజకీయ బలాబలాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.ఈ క్రమంలో నందమూరి తేజస్విని పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆమె సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రెండో కుమార్తె. విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ సతీమణి కూడా.
రాజకీయంగా ప్రభావం ఉన్న కుటుంబానికి చెందిన ఆమెను మేయర్ అభ్యర్థిగా నిలబెట్టవచ్చనే ప్రచారం సాగుతోంది. గతంలో భీమిలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2029



ఎన్నికల్లో పోటీ చేస్తారనే
ఊహాగానాలు కూడా వినిపించాయి. అయితే మేయర్ పదవికి పోటీ చేసే విషయంలో ఆమె ఆసక్తి, పార్టీ నిర్ణయం ఏమిటన్నది ఇంకా స్పష్టతకు రాలేదు. ఆమె పేరు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చకు
పరిమితమైంది.మరోవైపు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ సతీమణి లావణ్య పేరు కూడా వినిపిస్తోంది. ఆమెకు అవకాశం దక్కుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది. విశాఖ టీడీపీ అధ్యక్షుడు పట్టాభిరాం సతీమణి పేరును కూడా కొందరు ప్రస్తావిస్తున్నారు. జనసేన నుంచి పెద్దిశెట్టి ఉషశ్రీ, ఉత్తర నియోజకవర్గానికి చెందిన ఉషా కిరణ్ పేర్లు చర్చలో ఉన్నాయి. బీజేపీ నుంచి ఎమ్మెల్యే
విష్ణుకుమార్ రాజు కుటుంబానికి చెందిన మహిళ పోటీ చేస్తారా అన్నది కూడా రాజకీయ వర్గాల్లో ఆసక్తిని కలిగిస్తోంది.వైఎస్సార్‌సీపీ తరఫున మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి బొత్స ఝాన్సీ
పేరు వినిపిస్తున్నప్పటికీ, ఆమె పోటీపై స్పష్టత లేదు. పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి పేరు కూడా ప్రచారంలో ఉంది. మాజీ ఎమ్మెల్యేల కుటుంబాల నుంచి కొత్త అభ్యర్థులు తెరపైకి
వచ్చే అవకాశాలనూ కొట్టిపారేయలేం.మొత్తంగా విశాఖ మేయర్ పీఠం కోసం ప్రధాన పార్టీల్లో ఇప్పటి నుంచే కసరత్తు మొదలైనట్లు కనిపిస్తోంది. అయితే ప్రచారంలో ఉన్న పేర్లలో ఎవరికి పార్టీలు అవకాశంకల్పిస్తాయన్నది అధికారిక ప్రకటనల తర్వాతే తేలనుంది. సామాజిక సమీకరణాలు, రాజకీయ పలుకుబడి, స్థానిక నాయకుల మద్దతు ఈ ఎంపికలో కీలకంగా మారే అవకాశం ఉంది.

# ఏళ్ల చంద్రబాబు అనుభవానికి పవన్ పరీక్ష.. 40 శాతం లెక్క ఇదే..!



**విజయవాడ అక్టోబరు 14 పెన్ పవర్:** స్థానిక ఎన్నికలలో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు సరికొత్త రాజకీయానికి తెరతీస్తోందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా 50 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థత, సహనాన్ని పరీక్షించేలా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యవహార శైలి ఉందని అంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి కోసం తాము తగ్గామని చెబుతున్న పవన్.. ఇప్పుడు టీడీపీ ఆ మేరకు తగ్గాల్సిందేనని సంకేతాలు పంపుతున్నట్లుగా చెబుతున్నారు. జనసేన బలాబలాలతో సంబంధం లేకుండా మొత్తం పదవుల్లో 40 శాతం వాటా అడగడం, ఆ విషయాన్ని బహిర్గతం చేయడం ద్వారా అవసరమైతే ఒంటరి పోటీకి రెడీ అన్నట్లుగా జనసేన వైఖరి ఉందని అంటున్నారు. దీంతో కూటమిలో పొత్తు లెక్కలు క్షణక్షణానికి ఉత్కంఠ పెంచేస్తున్నాయని అంటున్నారు.స్థానిక ఎన్నికల్లో తమకు 40 శాతం సీట్లు ఇవ్వాలని పట్టుబడుతున్న జనసేన, 40 శాతం వాటా తమ హక్కుగా భావిస్తోందని చెబుతున్నారు. దీంతో ఒక్కసీటు తగ్గినా కుదరదు అన్నట్లుగా జనసేన అధినేత సంకేతాలు పంపుతున్నారని అంటున్నారు. ఈ కారణంగా సీట్ల పంచాయితీపై పీటముడి ఉత్కంఠకు గురిచేస్తోందని చెబుతున్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఒత్తిడికి గురిచేసి తన మాట నెగ్గించుకునేలా పవన్ ఆలోచన ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యమంత్రి సైతం మిత్రపక్షంపై మెతక వైఖరితో ఉండటం వల్ల టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయని అంటున్నారు. 40 శాతం వాటా సీట్లు అడుగుతున్న జనసేన మళ్లీ ఆయా సీట్లలో పోటీకి తమ పార్టీ నేతలనే తీసుకోవడం ఏం రాజకీయమో కూడా అర్థం కావడం లేదని టీడీపీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

**ముఖ్యమంత్రిని ఒత్తిడిక గురిచేసి..**

సీట్ల సర్దుబాటులో తన మాట నెగ్గించుకోవడమనే ఏకైక లక్ష్యంతో డిప్యూటీ సీఎం పవన్ పావులు కదుపుతున్నట్లుగా చెబుతున్నారు. ఇందుకు ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుపైనే తన అస్త్రాలు ప్రయోగిస్తున్నట్లుగా అనుమానిస్తున్నారు. పవన్ విషయంలో టీడీపీ అగ్రనేత చంద్రబాబుతోపాటు యువనేత లోకేశ్ కృతజ్ఞతాభావంతో ఉండటాన్ని పవన్ తనకు అనుకూలంగా మలుచుకున్నారని అంటున్నారు. అందుకే తాను కోరుతున్న సీట్ల విషయాన్ని బయటపెట్టి కూటమిలో ఇతర పక్షాలను ఒత్తిడికి లోను చేశారని అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ కోసం తగ్గినట్లు చెబుతున్న పవన్, తన పార్టీకి ఉన్న వాస్తవ బలాన్ని ఇప్పుడు పరిగణనలోకి తీసుకోకపోవడంపైనే అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో పవన్ అడిగిన అన్ని సీట్లు ఇచ్చినా, కొన్నిచోట్ల సమర్థులైన నేతలు లేక తమ పార్టీ నుంచి నాయకులను చేర్చుకుని పోటీకి పెట్టిన విషయాన్ని మరచిపోకూడదని కొందరు టీడీపీ నాయకులు గుర్తు చేస్తున్నారు. కానీ, పవన్ మాత్రం ఇప్పుడు గతాన్ని వదిలేసి అదే పద్ధతిలో ఎక్కువ సీట్లు తీసుకోవడమే కాకుండా, తమ పార్టీ నేతలను దిగుమతి చేసుకునే వ్యూహాన్ని అమలు చేస్తున్నారని చెబుతున్నారు. దీనివల్ల క్షేత్రస్థాయిలో తన పార్టీని బలోపేతం చేసుకోవడంతోపాటు స్థానిక సంస్థల్లో జన సేన భాగస్వామ్యం పెంచుకోవాలనే ఎత్తుగడను అమలు చేస్తున్నట్లుగా చెబుతున్నారు. నిజానికి కూటమిగా ఉన్నప్పుడు పార్టీల ఓట్ల శాతం ఆధారంగా సీట్ల పంపిణీ ఉంటుందని అంటున్నారు. కానీ, జనసేన మాత్రం తమ పార్టీ ఓటింగుతో సంబంధం లేకుండా బలంగా ఉన్నామని, కూటమిలో ప్రధాన పార్టీ టీడీపీతో సమానంగా వాటా కావాలని కోరుకోవడంపైనే పరిశీలకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.ఇక కూటమిగా చర్చలకు కూర్చొన్న సమయంలో ఎక్కడో ఒక చోట ఏకాభిప్రాయానికి రావాల్సివుండగా, పవన్ మాత్రం మొండి పట్టుదలతో తాడోపేడో తేల్చేసుకుందాం.. అన్న స్థాయికి చర్చల వాతావరణాన్ని తీసుకువెళ్లడం కూడా రాజకీయంగా వేడిపుట్టిస్తోందని అంటున్నారు. రాష్ట్రంలో 123 పట్టణ స్థానిక సంస్థలు ఉండగా, 6 మేయర్, 38 మున్సిపల్ చైర్మన్ పదవులను కోరుతున్న జనసేన ఒక్క స్థానం కూడా వదులుకోలేమని చెప్పడం ద్వారా ధృడమైన వైఖరి తీసుకున్నట్లుగా సంకేతాలు పంపుతోందని అంటున్నారు. ఈ విషయమై టీడీపీలోనూ అంతర్గతంగా భారీగా చర్చ జరుగుతున్నట్లు చెబుతున్నారు. జనసేనకు వాస్తవ బలం ఉన్న చోట సీట్లు ఇవ్వడంలో ఎవరికీ అభ్యంతరం లేకపోయినా, 40 శాతం వాటా అంటూ ఎక్కువ సీట్లు అడగడంపై ఆ పార్టీలో క్షేత్రస్థాయి నుంచి పార్టీ పొలిట్ బ్యూరో వరకు అభ్యంతరాలు వ్యక్తమవుతున్నట్లుగా చెబుతున్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ కు భయపడి ఎవరూ ఈ విషయంపై బహిరంగంగా మాట్లాడే సాహసం చేయలేకపోతున్నారని అంటున్నారు.

# పులివెందుల వైసీపీ అభ్యర్థి వైఎస్ ప్రమీల



**కడప,అక్టోబరు 14 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నగారా మోగిన వేళ, రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. తన సొంత అడ్డాపులివెందులకు అభ్యర్థిని ఖరారు చేశారు. పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్ వైయస్‌ఆర్‌సీపీ అభ్యర్థిగా వైఎస్ మనోహర్ రెడ్డి సతీమణి వైఎస్ ప్రమీలమ్మ పేరును జగన్ అధికారికంగా ప్రకటించారు. ఈ సారికుటుంబసభ్యులకు కాకుండా బయట వారికి చాన్సిస్తారని ప్రచారం జరిగినా.. అలాంటి ధైర్యం చేయలేకపోయారు.మనోహర్ రెడ్డి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరుడు మనోహర్ రెడ్డి.. జగన్‌కు బాబాయ్‌వరుసవుతారు. అటు జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి వైపు నుంచి కూడా వీరికి బలమైన కుటుంబ బాంధవ్యాలు ఉన్నాయి. దాదాపు మూడు దశాబ్దాలుగా పులివెందుల స్థానిక రాజకీయాలు, గ్రామీణపంచాయతీల నుంచి మున్సిపాలిటీ వరకు అంతా మనోహర్ రెడ్డి కనుసన్నల్లోనే నడిచేది. వైఎస్సార్ హయాం నుంచే స్థానిక సంస్థల పెత్తనాన్ని గుత్తాధిపత్యంగా నడిపిస్తున్న ఆయన.. జగన్ కేంప్‌కార్యాలయం, భారతి వ్యవహారాల్లోనూ తెరవెనుక కీలక చక్రం తిప్పుతూ వచ్చారు.పులివెందుల పురపాలక సంఘం చరిత్రను తిరగేస్తే.. ఈ దంపతుల చేతుల్లోనే స్థానిక అధికారం దశాబ్దాలుగా బందీఅయిందన్నది బహిరంగ రహస్యం. గతంలోనూ వైఎస్ ప్రమీలమ్మ పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. భర్త మనోహర్ రెడ్డి చక్రం తిప్పుతుంటే, భార్య ప్రమీలమ్మ చైర్‌పర్సన్ కుర్చీలోకూర్చుని నామమాత్రపు పాలన సాగించేవారు. మున్సిపాలిటీలో పనుల కేటాయింపులు, స్థానిక కాంట్రాక్టులు, వార్డుల నిర్వహణ అన్నీ వీరి కనుసన్నల్లోనే సాగాయి . పులివెందుల మున్సిపాలిటీలో నిజమైనప్రజాస్వామిక ప్రాతినిధ్యం గానీ, కొత్త నాయకత్వానికి అవకాశం గానీ దక్కలేదు. పార్టీలో ఏళ్ల తరబడి జెండాలు మోసి, కేసులు ఎదుర్కొన్న సామాన్య కిందిస్థాయి కార్యకర్తలకు ఎప్పుడూ కార్పొరేటర్ లేదావార్డు మెంబర్ టికెట్లే మిగిలాయి తప్ప.. కీలకమైన చైర్‌పర్సన్ కుర్చీ మాత్రం మళ్లీ తిరిగి ప్రమీలమ్మ ముంగిట్లోనే వాలింది.కడప ఎంపీగా అవినాష్ రెడ్డి, అసెంబ్లీలో జగన్, ఇప్పుడు మున్సిపాలిటీలో బాబాయ్‌భార్య ప్రమీలమ్మ.. ఇలా స్థానిక నుంచి పార్లమెంట్ దాకా అధికారం అంతా నాలుగు గోడల మధ్యే ఉండాలన్న జగన్ ఆధిపత్య మనస్తత్వాన్ని ఈ నిర్ణయం ప్రతిబింబిస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల్లోపులివెందులలోనే మెజారిటీ గణనీయంగా తగ్గిపోయి సొంత గడ్డపైనే పట్టు సడలిన సంకేతాలు కనిపించినప్పటికీ.. జగన్ మాత్రం కనీస మార్పునకు సిద్ధపడలేదు.ఈ సారి ప్రత్యక్ష ఎన్నిక కావడంతో .. టీడీపీ బలమైన మహిళా అభ్యర్థిని నిలిపే అవకాశం ఉంది.

## ఉప్పల్‌లో టీమిండియా ఓటమి.. 2-2తో
# సిరీస్ సమం చేసిన విండీస్




హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం (ఉప్పల్) వేదికగా జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్ బౌలర్ల దెబ్బకు భారత జట్టు ఘోరంగా ఓడిపోయింది. విండీస్ నిర్దేశించిన 248 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియా తడబడి, 24 పరుగుల తేడాతో పరాజయం చవిచూసింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను వెస్టిండీస్ 2-2 తేడాతో సమం చేసింది. ఈ ఉత్కంఠభరిత పోరులో కీమో పాల్ ఐదు వికెట్లతో చెలరేగి భారత్ విజయానికి గండికొట్టగా, మ్యాచ్ మధ్యలో పేసర్ అర్షదీప్ సింగ్ గాయంతో రిటైర్డ్ హార్ట్ కావడంతో 19.3 ఓవర్లలోనే టీమిండియా ఆలౌట్ అయింది.

**కీమో పాల్ వీరవిహారం:**

248 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు ఓపెనర్లు మంచి ఆరంభమే ఇచ్చినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ముఖ్యంగా వెస్టిండీస్ బౌలర్ కీమో పాల్ టీమిండియా ఇన్నింగ్స్‌ను శాసించాడు. ఒకే ఓవర్లో నితీష్ కుమార్ రెడ్డి (41 పరుగులు), ప్రిన్స్ యాదవ్ (గోల్డెన్ డక్), అక్షర్ పటేల్ (3 పరుగులు)లను పెవిలియన్‌కు పంపి మ్యాచ్ స్వరూపాన్ని పూర్తిగా మార్చేశాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం 5 వికెట్లు పడగొట్టి ఇండియా విజయావకాశాలను దెబ్బతీశాడు. ఆయనతో పాటు గుడకేష్ మోటీ 2 వికెట్లు తీసుకోగా, షామర్ స్ప్రింగర్, రొమారియ షెపర్డ్ తలో వికెట్ తీసుకుని భారత్‌ను కోలుకోలేని దెబ్బతీశారు.

**పోరాడి ఓడిన భారత బ్యాటర్లు:**

భారత జట్టు తరపున సంజు శాంసన్, తెలుగు కుర్రాళ్లు తిలక్ వర్మ (43), నితీష్ కుమార్ రెడ్డి (41), అభిషేక్ శర్మ (29) పోరాడినప్పటికీ 248 పరుగుల లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేకపోయారు. ముఖ్యంగా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (16), ఇషాన్ కిషన్ (6), నమన్ ధీర్ (0), అక్షర్ పటేల్ (3) బ్యాటింగ్‌లో పూర్తిగా విఫలమయ్యారు.

దీనికి తోడు పేసర్ అర్షదీప్ సింగ్ గాయం కారణంగా రిటైర్డ్ హార్ట్‌గా వెనుదిరగడం జట్టు 223 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో 24 పరుగుల తేడాతో ఇండియా ఓడిపోయింది. ఇక ఐదో టీ20 మ్యాచ్ బెంగళూరు వేదికగా అక్టోబర్ 17వ తేదీన జరగనుంది.

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్ల హవా..
# శ్రేయస్ అయ్యర్‌కు కెరీర్ బెస్ట్ ర్యాంక్!

- టీ20 ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానానికి దూసుకెళ్లిన శ్రేయస్
- తొలి టీ20 సెంచరీతో కెరీర్లోనే అత్యుత్తమ ర్యాంక్ సాధించిన వైనం
- టాప్-4లో ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, అయ్యర్‌తో ముగ్గురు భారతీయులు
- టెస్టుల్లో నంబర్ వన్ ఆల్‌రౌండర్‌గా రవీంద్ర జడేజా స్థానం పదిలం
- ఆసీస్, పాక్, దక్షిణాఫ్రికా ఆటగాళ్ల ర్యాంకుల్లోనూ కీలక మార్పులు




భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకును అందుకున్నాడు. వెస్టిండీస్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన అయ్యర్, మూడు స్థానాలు ఎగబాకి నాలుగో ర్యాంకును కైవసం చేసుకున్నాడు. లక్నో వేదికగా జరిగిన సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో తన తొలి టీ20 అంతర్జాతీయ శతకాన్ని నమోదు చేయడం అతడి ర్యాంకు భారీగా పెరగడానికి కారణమైంది. అయ్యర్ రాకతో టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్-4లో ముగ్గురు భారత ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం. ఇషాన్ కిషన్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, అభిషేక్ శర్మ రెండో స్థానంలో ఉన్నాడు. పాకిస్థాన్ కెప్టెన్ సాహిబ్జాదా ఫర్హాన్ మూడో స్థానంలో నిలిచాడు. ఇదే సిరీస్‌లో రాణించిన మరో భారత ఆటగాడు సంజూ శామ్సన్ కూడా నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని 27వ ర్యాంకుకు చేరుకున్నాడు.

ఇక బౌలింగ్ విషయానికి వస్తే.. భారత్‌తో సిరీస్‌లో రాణించిన వెస్టిండీస్ ఆటగాడు రోస్టన్ చేజ్ 24 స్థానాలు ఎగబాకి 23వ ర్యాంకులో నిలిచాడు. ఆల్‌రౌండర్ల జాబితాలోనూ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని మూడో స్థానానికి చేరుకున్నాడు. పాకిస్థాన్ బౌలర్ సల్మాన్ మీర్జా 14వ స్థానానికి, సయీం అయూబ్ 54వ స్థానానికి మెరుగుపడ్డారు.

**టెస్టుల్లోనూ కీలక మార్పులు**

దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 214 పరుగుల తేడాతో విజయం సాధించడంతో టెస్టు ర్యాంకింగ్స్‌లోనూ పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మ్యాచ్‌లో 190, 82 పరుగులతో అద్భుత ప్రదర్శన చేసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన ఆస్ట్రేలియా బ్యాటర్ మాథ్యూ రెన్షా, ఏకంగా టాప్-100 బయట నుంచి 49వ ర్యాంకుకు దూసుకొచ్చాడు.

ఆసీస్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ కెరీర్ బెస్ట్ గణాంకాలతో (6/49) రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఏడో ర్యాంకుకు చేరుకున్నాడు. మిచెల్ స్టార్క్ అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టెస్టు ఆల్‌రౌండర్ల జాబితాలో తన నంబర్ వన్ స్థానాన్ని పదిలంగా ఉంచుకున్నాడు. మరోవైపు, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ మధ్య జరిగిన టెస్టులో రాణించిన రహ్మత్ షా 13వ ర్యాంకుకు, లిటన్ దాస్ 29వ ర్యాంకుకు చేరుకున్నారు.

# అభిషేక్ శర్మ రికార్డు బద్దలు కొట్టిన పాక్ కెప్టెన్ ఫర్హాన్!



పాకిస్థాన్ కెప్టెన్ సాహిబ్జాదా ఫర్హాన్ టీ20 క్రికెట్‌లో ప్రపంచ రికార్డు సృష్టించాడు. శ్రీలంకతో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 238 పరుగులు సాధించి, భారత ఆటగాడు అభిషేక్ శర్మ నెలకొల్పిన 229 పరుగుల రికార్డును అధిగమించాడు. ఫర్హాన్ చివరి మ్యాచ్‌లోనూ 76 పరుగులతో రాణించాడు. అయితే, ఈ మ్యాచ్‌లో శ్రీలంక 8 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌పై విజయం సాధించింది. కుశాల్ మెండిస్ 87 పరుగులతో జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించాడు. అయినప్పటికీ పాకిస్థాన్ తొలి రెండు మ్యాచ్‌ల్లో గెలవడంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది.

# ఫ్లాప్ హీరోపై మళ్లీ 'వందల కోట్లు' నమ్మకం..!



తెల్లని లేస్ కార్సెట్ టాప్ మరియు డెనిమ్ షార్ట్స్‌లో యాషికా ఆనంద్ మెరుపులు

కేజీఎఫ్‌తో పాన్ ఇండియా స్టార్‌గా మారిన యశ్ ఇటీవల 'టాక్సిక్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి తీవ్రంగా నిరాశ పరిచిన విషయం తెల్సిందే. కన్నడ ప్రేక్షకులు మినహా టాక్సిక్ సినిమాను మరే భాష ప్రేక్షకులు చూసేందుకు ఆసక్తి చూపించలేదు. అంతే కాకుండా యశ్ పై తీవ్ర విమర్శలు వచ్చాయి. దాదాపు రెండేళ్లు వెయిట్ చేసి నువ్వు ఎంపిక చేసుకున్న స్క్రిప్ట్ ఇదా అంటూ యశ్ ను ఓ రేంజ్‌లో ట్రోల్స్ చేశారు.



అంతే కాకుండా దర్శకురాలును కాదని యశ్ సినిమాను తీసినట్లుగా అనిపించిందనే విమర్శలు సైతం వచ్చాయి. కేజీఎఫ్ సినిమా కేవలం ప్రశాంత్ నీల్ వల్ల హిట్ అయింది, కనుక యశ్ మళ్లీ ఆ రేంజ్ సినిమాల కోసం ప్రయత్నాలు చేయక పోవడం మంచిదని కొందరు సలహా ఇచ్చారు. కాస్త కిందికి దిగి యశ్ సినిమాలు చేస్తే బెటర్ అని, లేదంటే కెరీర్ చిక్కుల్లో పడే అవకాశాలు ఉన్నాయంటూ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

**యశ్ టాక్సిక్ మూవీ తర్వాత...**

టాక్సిక్ సినిమా ఫలితం తర్వాత కూడా యశ్ మళ్లీ అదే స్థాయి సినిమాను చేయాలని, మళ్లీ కేజీఎఫ్ రేంజ్ హిట్ కొట్టాలని ఆశ పడుతున్నాడు. అందుకోసం స్క్రిప్ట్‌ను చూస్తున్నాడు, ఆ రేంజ్‌లో సినిమాను తీసే వారిని, ఆ స్థాయిలో బడ్జెట్ ఖర్చు చేసే వారిని యశ్ చూస్తున్నట్లు కన్నడ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఫైనల్‌గా యశ్ తో పీఎస్ మిత్రన్ ఒక భారీ సినిమాను చేసేందుకు రెడీ అయ్యాడు. ఆ మధ్య ధనుష్ తో మిత్రన్ అనుకున్న సినిమాను కొన్ని కారణాల వల్ల యశ్ తో చేసేందుకు సంజయ్ లీలా భన్సాలీ రెడీ అయ్యాడని వార్తలు వస్తున్న విషయం తెల్సిందే. అయితే భారీ ఫారెస్ట్ అడ్వెంచర్ మూవీ కావడంతో సినిమాకు వందల కోట్ల బడ్జెట్ ఖర్చు అవుతుందని అంటున్నారు. యశ్ పై ఆ స్థాయిలో ఖర్చు పెట్టడం ఎంత వరకు కరెక్ట్ అంటూ కొందరు ఈ సందర్భంగా ప్రశ్నిస్తున్నారు. యశ్ పై బలమైన కంటెంట్ ఉంటే తప్ప ఖర్చు పెట్టకూడదని విశ్లేషకులు అంటున్నారు.

**సంజయ్ లీలా భన్సాలీ నిర్మాణంలో...**

సంజయ్ లీలా భన్సాలీ ఈ సినిమాను నిర్మించేందుకు రెడీగా ఉన్నాడు. అయితే యశ్ ను సైతం నిర్మాణ భాగస్వామిగా చేర్చే అంశమై పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పీఎస్ మిత్రన్ హాలీవుడ్ మూవీ ఇండియానా జోన్స్ రేంజ్‌లో ఒక స్క్రిప్ట్ ను రెడీ చేశాడట. విదేశాల్లో ఎక్కువగా షూట్ ఉంటుందని అంటున్నారు. కనుక ఈ సినిమా కచ్చితంగా భారీ బడ్జెట్ మూవీగా నిలిచే అవకాశాలు ఉన్నాయి. పీఎస్ మిత్రన్ గత చిత్రాల ఫలితాలను చూస్తే ఇప్పుడు ఇలాంటి మూవీ అవసరమా అనే అభిప్రాయం కలుగక మానదు. మిత్రన్, యశ్ కాంబో అంటే కనీసం బజ్ క్రియేట్ అయ్యే పరిస్థితి లేదు. సినిమా మొదలు అయితే ఏమైనా మ్యాజిక్ జరిగి బజ్ క్రియేట్ అవుతుందా అనేది చూడాలి. సాధారణంగా ఒక సినిమా గురించి చిన్న పుకారు వచ్చినా సోషల్ మీడియాలో ఆహా... ఓహో అనే రేంజ్ లో ప్రచారం జరుగుతుంది. కానీ ఈ సినిమా గురించి పెద్దగా పట్టించుకునే వారే లేరు.



దిశా పటాని గ్లామరస్ లుక్: వైరల్ అవుతున్న లేటెస్ట్ మిర్రర్ సెల్ఫీ

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965